# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 13 జూలై 2025 | సంపుటి:9 | సంచిక:196 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM



## ఆపత్కాల సేవల్లో సబల

సింగరేణిలో తొలి మహిళా రెస్క్యూ టీం




2

## శుభాంశు శుక్లాకు క్వారంటైన్



2

## టెన్షన్ టెన్షన్.. గుడివాడలో తీవ్ర ఉద్రిక్తత..

# భారీగా మోహరించిన బలగాలు



**గుడివాడ, జూలై 12(మనం న్యూస్):** సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా గుడివాడ నియోజకవర్గం లోని లింగవరంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. వైకాపా నేత కొడాలి నానికి చెందిన కె.కన్వెన్షన్ ఇందుకు వేదికైంది. అదే సమయంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా నాగవరప్పాడు సెంటర్‌కు చేరుకున్నాయి. ఈ క్రమంలో నాగవరప్పాడు సెంటర్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.వైకాపా సమావేశానికి ఆహ్వానం పలుకుతూ నాగవరప్పాడు సెంటర్‌లో ఆ పార్టీ నేతలు ప్రత్యేక బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో తెదేపా నాయకులు.. 'జై తెలుగుదేశం... గుడివాడ గడ్డ రామన్న అడ్డా..' అని నినాదాలు చేస్తూ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. తెదేపా ర్యాలీలోంచి కొందరు నాయకులు వైకాపా బ్యానర్లను చించేశారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. కొడాలి నానికి చెందిన కె. కన్వెన్షన్‌లోకి వెళ్లేందుకు తెదేపా నేతలు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న వైకాపా నేతలు కె.కన్వెన్షన్ నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న డీఎస్పీ ధీరజ్ వినీల్ నేతత్వంలోని పోలీసులు వారు బయటకు రాకుండా నిలువరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో నాగవరప్పాడు సెంటర్‌లో పోలీసు బలగాలు మోహరించాయి.

### వైకాపా చైర్ పర్సన్ హారిక కారు ధ్వంసం

జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఉప్పల హారిక కారును తెదేపా శ్రేణులు ధ్వంసం చేశాయి. తొలుత ఆమె కె.కన్వెన్షన్‌లో జరుగుతున్న నియెజకవర్గ స్థాయి సమావేశానికి హాజరవడానికి నాగవరప్పాడు సెంటర్ మీదుగా లింగవరం వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే నాగవరప్పాడు సెంటర్‌కు భారీగా చేరుకున్న తెదేపా శ్రేణులు ఆమె కారును అడ్డగించారు. పోలీసులు ఆందోళనకారులను అడ్డుకొని కారును అక్కడినుంచి పంపించారు. ఆమె వెనక్కి వెళ్లి మళ్లీ తిరిగిరావడంతో రెచ్చిపోయి కారుపై రాళ్లతో దాడి చేశారు. అతి కష్టం మీద ఆమె కారును అక్కడినుంచి పోలీసులు మళ్లీ పంపించారు.




## పేర్ని నానిపై

# కేసు నమోదు

**పామర్రు, జూలై 12(మనం న్యూస్):** మాజీ మంత్రి పేర్ని నానిపై కష్ణా జిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అవనిగడ్డ, పామర్రు నియోజక వర్గాల్లో జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో రప్పా రప్పా అనటం కాదు చేసి చూపించండి.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పేర్ని నాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ రాష్ట్ర నేత కనపర్తి శ్రీనివాసరావు.. అవనిగడ్డ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ బియ్యం దొంగ పేర్ని నాని.. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. మరోవైపు పేర్ని నాని వ్యాఖ్యలపై అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కష్ణా జిల్లాలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం కార్యక్రమాల్లో మాజీ మంత్రి పేర్ని నాని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'లోకేష్ రెడ్ బుక్ అంటే.. మీరు రప్పా రప్పా అంటున్నారు.. ఏదైనా చేయాలంటే చీకట్లో కన్నుకొడితే అయిపోవాలే తప్ప.. రప్పా రప్పా అని అనటం కాదు.. అంటూ కార్యకర్తలకు సూచించారు. ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఆ.. మాటలు జగన్‌వే...

- దేవినేని ఉమ




**అమరావతి, జులై 12:** 151 సీట్ల మదంతో జగన్ చేసిన దుర్మార్గాలకు 11 సీట్లతో ప్రజలు లేవకుండా చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. చీకట్లో కన్ను కొట్టే తప్పుడు పనులు చేయబట్టే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి బలి చేసేందుకే గవర్నమెంట్ వచ్చాక సైలెంట్‌గా వేసెయ్యాలంటూ మాజీ మంత్రి పేర్ని నాని పిచ్చి ప్రేలాపనలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రధాన మంత్రి కార్యాలయానికి బాంబే స్టాక్‌కు దేశ విదేశాల్లో ఉన్న వైసీపీ కార్యకర్తలతో తప్పుడు మెయిల్స్ పెట్టించి పెట్టుబడులు రాకూడదని కుట్రలు చేశారని విమర్శించారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని ఆయన వెల్లడించారు. సొంత కార్యకర్త సింగయ్యను కారుతో తొక్కించిన జగన్ రెడ్డి తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి సింగయ్య భార్యను బెదిరించి తప్పుడు ప్రకటన ఇప్పించారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టాలన్నదే జగన్ వ్యూహకర్తల పన్నాగమని ఆరోపించారు. సోదరి వరస అయ్యే మహిళా ఎమ్మెల్యే పట్ల ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఖండించకుండా జగన్ సమర్థించారన్నారు. జగన్ రెడ్డి అంతరంగంలో ఉన్న మాటలే ప్రసన్న కుమార్ రెడ్డి, పేర్ని నాని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చంద్రయ్య గొంతు కోసినందుకే కదా ఈ దుస్థితి పట్టిందని కామెంట్స్ చేశారు.'కర్మ ఫలం అనుభవిస్తున్నామంటూ విజయసాయిరెడ్డి భగవద్గీత శ్లోకాలు బోధిస్తున్నారు. సిట్ విచారణలో నీ దగ్గర పనిచేసిన అధికారులే నీ గుట్టు విప్పుతున్నారు' అని అన్నారు. శాసనసభపై, అంబేద్కర్ రాజ్యాంగంపై గౌరవం లేకుండా ఇష్టానుసారం ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరు జగన్ రెడ్డి అని హెచ్చరించారు. పేర్ని నాని అభ్యంతరకర వ్యాఖ్యలపై పోలీస్ యంత్రాంగం సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర్ రావు డిమాండ్ చేశారు.

## పేర్ని నాని అక్కడికి వెళ్లు..

## నీ రప్పా..రప్పా సంగతి వాళ్లే చూస్తారు

- బోడె ప్రసాద్




**అమరావతి, జులై 12:** ప్రజాస్వామ్యాన్ని అంతం చేసేందుకు వైసీపీ శ్రేణులు కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు చేసే ప్రతీ పనిని ప్రజలు నిశితంగా గమనిస్తారన్నారు. తప్పు జరిగితే క్షమించను అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారని గుర్తు చేసిన ఎమ్మెల్యే.. వైసీపీ నేతలు మాత్రం విధ్వంసమే పరమావధిగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. రెంటపాళ్లలో వైసీపీ కార్యకర్త రప్పా.. రప్పా.. అని ప్లకార్డు పట్టుకుంటే.. మీడియా సమక్షంలో దానిని సమర్థించారంటే జగన్ రెడ్డి మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోందని ఎద్దేవా చేశారు. ఒక పార్టీ అధ్యక్షుడిగా, మాజీ సీఎంగా ప్రజాప్రతినిధులకు ఇచ్చే స్ఫూర్తి ఇదేనా అని జగన్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రశ్నించారు.చీకట్లో కన్ను కొడితే.. తలలు నరికేయండి' అని కష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షులు పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. చంద్రబాబు అభివద్ధి %-% సంక్షేమం చేసి ప్రజల మన్ననలు పొందాలని పదేపదే చెప్తూ ఉంటారన్నారు. కానీ వైసీపీ వారు మాత్రం హత్యలు చేయండి.. తలలు నరకండని చెప్తున్నారంటే వారి పార్టీ ఆలోచనలు, నాయకుల మానసిక పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థమవుతుందన్నారు. హింస, విధ్వంసం వైసీపీ పాలసీ అని పేర్నినాని వ్యాఖ్యల ద్వారా మరోసారి స్పష్టమైందని ఎమ్మెల్యే విమర్శించారు. రప్పా.. రప్పా.. నరికేస్తాం.. అనేది వైసీపీ తీసుకువచ్చిన రాజారెడ్డి రాజ్యాంగమని విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోందని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం, అక్రమ మైనింగ్, భూ దందా, అవినీతి సొమ్ముతో పేర్ని నాని విర్రవీగి వ్యవహరిస్తున్నారని.. ఎన్నికల ఫలితాలను గుర్తు చేసుకోవాలని హితవుపలికారు. గత ప్రభుత్వ పాలనలో బీచ్ రోడ్డులో పూరి గుడిసెలకు నిప్పు పెట్టడం, ప్రజా రక్షణ కోసం పని చేసే పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడం అనేది నిజమా..? కాదా..? అని ప్రశ్నించారు. 'రప్పా.. రప్పా అని టీవీల ముందు కాదు.. మచిలీపట్నంలో నువ్వు ఆక్రమించిన వెయ్యి గజాల తమ్మిన వారి సత్రం దగ్గర కానీ, నువ్వు కబ్జా చేసిన కోటా జయరాం పొలం వద్ద కానీ, రంగనాయక స్వామి గుడి దగ్గరకు కానీ వెళ్తే అక్కడి స్థానికులు నీ రప్పా.. రప్పా.. సంగతి చెప్తారు' అంటూ బోడె ప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## ప్రతిష్ఠాత్మకంగా రోజ్‌గార్ మేళా



**విశాఖపట్నం:** రోజ్‌గార్ మేళాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉద్ఘాటించారు. ఒక రికార్డ్‌లా రోజ్‌గార్ మేళా కార్యక్రమం ముందుకు సాగుతోందని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ దేశం కోసం నిరంతరం కషి చేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలో భారత్ నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఉద్ఘాటించారు. విశాఖపట్నంలోని సాగర్ మాలా కన్వెన్షన్ సెంటర్‌లో రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోజ్‌గార్ మేళాలో పాల్గొన్న 52 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం లలిత్ బొహ్రా, రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మీడియాతో మాట్లాడారు. శనివారం విశాఖలో రోజ్‌గార్ మేళాలో 52 మందికి ఉద్యోగ నియామక పాత్రలు అందజేశామని తెలిపారు. మూలపేట నుంచి భోగాపురం వరకు తీర ప్రాంతం గుండా రోడ్డు మంజూరు కావడం శుభపరిణామమని అన్నారు. ఆ రోడ్డు ప్రస్తుతం డీపీఆర్ స్టేజ్‌లో ఉందని తెలిపారు. ఈ రోడ్డు ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎంతగానో ఉపయోగపడుతోందని చెప్పారు. త్వరలో ఆ రోడ్డు పనులు ప్రారంభించడానికి తమవంతుగా కషి చేస్తామని అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు. అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి సంబంధించి ఏఏఐబీ ప్రాథమిక నివేదిక వచ్చిందని తెలిపారు. ప్రాథమిక నివేదిక ద్వారా ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించలేమని చెప్పారు. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాత వివరాలను వెల్లడిస్తామని అన్నారు. విమాన ప్రమాద బాధితులకు తప్పకుండా న్యాయం

## ఉధృతంగా గోదావరి

- ధవళేశ్వరం నుంచి 5 లక్షల క్యూసెక్కులు విడుదల




**రాజమహేంద్రవరం:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరం వద్ద గోదావరిలో వరద ఉద్ధతి అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద 11 అడుగుల నీటిమట్టం ఉండగా.. బ్యారేజి నుంచి 5లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వరద ఉద్ధతి మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం 11.78 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

## ఎక్సైజ్ పోలీసుల కస్టడీకి కాకాని

**నెల్లూరు:** మాజీ మంత్రి, వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఎక్సైజ్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. 2024 ఎన్నికల సమయంలో మద్యం అక్రమంగా నిల్వ ఉంచారని కాకాణిపై ముత్తుకూరు ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం అక్రమ నిల్వల కేసులో రెండ్రోజుల కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇవాళ కాకాణిని కస్టడీకి తీసుకొని అధికారులు విచారిస్తున్నారు.

## ఐదు నగరాలకు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు

- ప్రకటించిన కేంద్రం




**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, గుంటూరుకు అవార్డులు దక్కాయి. జాతీయ స్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డును విశాఖ నగరం దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో మినిస్టీరియల్ అవార్డుకు రాజమహేంద్రవరం ఎంపికైంది. స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు ఎంపికయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక కావడంపై ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ స్పందించారు. సీఎం చంద్రబాబు చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల వల్లే ఈ అవార్డులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కషి చేసిన అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది, ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

## మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు త్వరలో శుభవార్త




- మంత్రి నారాయణ

**అమరావతి, జూలై 12(మనం న్యూస్):** మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని మంత్రి నారాయణ వెల్లడించారు. కార్మికుల డిమాండ్లను సాధ్యమైనంతవరకూ పరిష్కరించాలని సీఎం చంద్రబాబు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఆదేశించారన్నారు. కార్మికుల డిమాండ్లపై కేబినెట్ సబ్ కమిటీ పలు మార్లు చర్చించిందన్నారు. వారికి మేలు చేసేలా మంత్రివర్గ ఉపసంఘం సానుకూల నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆర్థిక శాఖతో చర్చించి ప్రభుత్వ నిర్ణయాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

## వైసీపీ నేతలతోనే శాంతి భద్రతలకు భంగం




- మంత్రి డోలా ఫైర్

**పార్వతీపురం (మన్యం జిల్లా):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రప్పా రప్పా అనడంలో ఒక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిగా మీ భాషా అదేనా అని ప్రశ్నించారు. వైసీపీని ప్రజలు ఎప్పుడో మానసికంగా నరికి అవతల పడేశారని విమర్శించారు. మన్యం జిల్లాలో మంత్రి పర్యటించారు. మన్యం జిల్లా కేంద్రంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి డీబీవీ స్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బొనేల విజయచంద్ర, కూటమి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి బాల వీరాంజనేయ స్వామి మాట్లాడారు. యథా రాజా తథా ప్రజా అనే చందంగా ఈరోజు రాష్ట్రంలో విపక్ష పార్టీ వైసీపీ పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ప్రజలు వైసీపీని ఎప్పుడో చీత్కారించారని అయినా ఆ పార్టీ నేతల్లో మార్పు రావడం లేదని మండిపడ్డారు. జగన్‌కి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా.. 151 నుంచి 11 సీట్లకు పడిపోతే వారి పరిస్థితి ఇంకా అర్థం కావడం లేదని విమర్శించారు. పదిమంది కలిసి గుంపులుగా వెళ్లి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీలో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ నేతలు కారకులు అవుతున్నారని మంత్రి బాల వీరాంజనేయ స్వామి మండిపడ్డారు.

## అమెరికాలో కష్టాలే కష్టాలు..

- వీసా దొర్కిందని రిలాక్స్ కావొద్దని హెచ్చరించిన ఎంబసీ

**ఢిల్లీ, జూలై 12:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. అయితే, వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అగ్రరాజ్యం తాజాగా హెచ్చరించింది. ఈ మేరకు భారత్లోని యూఎస్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. 'వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తూనే ఉంటాం. అమెరికా చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు తప్పనిసరిగా పాటించాల్సిందే. వాటిని అతిక్రమిస్తే మాత్రం తక్షణం వీసాలను రద్దు చేసి దేశం నుంచి వెళ్లగొడతాం' అని ఎంబసీ తమ పోస్ట్‌లో స్పష్టంచేసింది.

## మంగళగిరి ఎయిమ్స్ వద్ద 2కే రన్



**మంగళగిరి:** మూత్ర సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించేందుకు యూరాలజిస్టు సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రి వద్ద 2కే రన్ నిర్వహించారు. సుమారు వంద మంది యూరాలజిస్టులు, మంగళగిరి వాకర్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మంగళగిరి ఎయిమ్స్ సంచాలకులు డాక్టర్ శాంతా సింగ్ ర్యాలీని ప్రారంభించారు. మూత్ర సంబంధిత వ్యాధులపై అవగాహన ఉంటే చికిత్స అందించడం సులభంగా ఉంటుందని వైద్యులు తెలిపారు. మందులు, శస్త్ర చికిత్సలు లేకుండానే కేవలం వైద్యుల సలహాలు పాటించడం ద్వారా అనేక మూత్ర సంబంధిత వ్యాధులను తగ్గించుకోవచ్చన్నారు. వీటిపై అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీని ఏర్పాటు చేశామని వైద్యులు తెలిపారు.

## ఆపత్కాల సేవల్లో సబల

### సింగరేణిలో తొలి మహిళా రెస్క్యూ టీం



**హైదరాబాద్, జూలై 12:** దాదాపు శతాబ్దన్నర ఏండ్ల చరిత్ర గల సింగరేణిలో తొలి సారిగా ఒక మహిళా రెస్క్యూ టీం నియమితమైంది. బొగ్గు బావిలోకి నీళ్లొచ్చినా, విషవాయువు కమ్మినా.. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా.. ఆపత్కాల సేవలు అందించేలా రాటుదేలారు 14 రోజుల పాటు కఠోర తర్ఫీదు పొందిన మహిళలు వీరికి సింగరేణి యాజమాన్యం రెస్క్యూ పట్టాలు ప్రదానం చేసింది.

## శుభాంశు శుక్లాకు వారం క్వారంటైన్



**బెంగళూరు, జూలై 12:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో పరిశోధనలు చేసి రేపు భూమికి తిరిగొస్తున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా 14న భూమికి తిరిగి రానున్నారు. ల్యాండ్ అయిన వెంటనే ఆయనను ఏడు రోజుల పాటు క్వారంటైన్ లో పెడతారు. శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ ఉజ్నాన్స్కి-విస్నియెస్కీ, టిబర్ కపులు అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించిన కారణంగా భూ వాతావరణానికి వారి శరీరాలు అలవాటుపడేందుకు వీలుగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్నెస్ ను నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. అంతరిక్షం నుంచి భూమికి బయల్దేరే ముందు కూడా వారికి పలు ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తారన్నారు. క్వారంటైన్లో ఉన్న వారం రోజుల్లో అంతరిక్ష యాత్ర వల్ల వ్యోమగాముల శరీరాలపై పడిన ప్రభావాన్ని వైద్యాధికారులు అధ్యయనం చేస్తారని తెలిపారు.

## గోకర్ణ గుహలో రష్యన్ మహిళ

- ఆమెతో పాటు ఇద్దరు చిన్నారులు కూడా
- పెట్రోలింగ్ సమయంలో గుర్తించిన పోలీసులు



**కుంటా(కర్ణాటక), జూలై 12:** ఆధ్యాత్మికత కోసం వివిధ దేశాలకు చెందిన ఎంతోమంది భారత్‌కు రావడం ఇటీవల పెరిగిన విషయం తెలిసిందే. ఇలాగే వచ్చిన ఓ రష్యన్ మహిళ గోకర్ణలోని దట్టమైన అడవుల్లో రహస్య జీవనం సాగిస్తున్న విషయం వెలుగు చూసింది. ఓ చిన్న గుహలో ఆమెతో పాటు ఇద్దరు చిన్నారులు కూడా ఉండటం గమనార్హం. ఆమెకు నచ్చజెప్పి అక్కడ నుంచి బయటకు తీసుకువచ్చిన పోలీసులు.. సొంత దేశానికి తిప్పి పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర కన్నడ జిల్లాలోని కుంటా తాలుకాలో దట్టమైన అడవులున్నాయి. అక్కడి రామతీర్థ పర్వత ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఓ గుహ వద్ద ఎవరివో దుస్తులు ఉన్నట్లు గమనించారు. దట్టమైన అడవి, కొండచరియలు విరిగిపడే ఆ ప్రమాదకరమైన ప్రాంతంలో ఎవరో నివాసం ఉండవచ్చనే అనుమానంతో ముందుకెళ్లారు. పైకి వెళ్లి చూడగా అక్కడున్న గుహలో ఓ మహిళ, ఇద్దరు చిన్నారులు కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. రష్యాకు చెందిన ఆమెను నైనా కుటినా అలియాస్ మోహి (40)గా గుర్తించారు. ఆరు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. బిజినెస్ వీసాపై భారత్‌కు వచ్చిన నైనా.. హిందుత్వం, ఆధ్యాత్మికతకు ఆకర్షితురాలైంది. ఈ క్రమంలో గోవా నుంచి గోకర్ణకు వెళ్తున్న సమయంలో పర్వత ప్రాంతంలో ఓ ప్రదేశం ఆమెకు నచ్చింది. దట్టమైన అడవులో ఉన్న గుహలో ఓ చిన్న నివాసం ఏర్పరచుకొంది. అక్కడే రుద్ర విగ్రహాన్ని పెట్టుకొని నిత్యం ఆరాధిస్తూ ప్రకృతి ఒడిలో ధ్యానంలో మునిగిపోయింది. ఆమెకు తోడుగా ఇద్దరు చిన్నారులు మాత్రమే ఉన్నారు. ఆ గుహ ఉన్న రామతీర్థ కొండల్లో 2024లో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. వన్యమృగాలు, అత్యంత విషపూరిత సర్పాలు ఉండే ఆ ప్రాంతంలో రెండు వారాలుగా ఆమె ఎలా నివసించారు? ఏం తిన్నారనే దానిపై పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అదృష్టవశాత్తు ఆమెకు ఎటువంటి అపాయం జరగలేదన్నారు. అయితే, ఆమె వీసా గడువు 2017లోనే ముగిసిందని, భారత్‌లో ఎప్పటి నుంచి ఉంటున్నారనే విషయంపై స్పష్టత లేదన్నారు. ప్రస్తుతానికి స్థానిక ఆశ్రమంలో ఉంచిన అధికారులు.. రష్యన్ ఎంబసీకి ఈ విషయాన్ని తెలియజేశారు. త్వరలోనే బెంగళూరు తరలిస్తామని, అక్కడ నుంచి ఆమె స్వదేశానికి పంపించే ఏర్పాట్లు చేస్తామని జిల్లా పోలీసులు వెల్లడించారు.

## ఒక చేప జాతి కోసం 300 డ్యామ్‌లు కూల్చివేత

- పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రత కోసం చైనా చేపట్టిన అరుదైన చర్యలు

**బీజింగ్, జూలై 12:** పర్యావరణ పరిరక్షణకు చైనా ఎంతటి ప్రాధాన్యతనిస్తుందో తెలియజేసే భారీ చర్య ఒకటి వెలుగులోకి వచ్చింది. దాదాపు చైనా పొడవునా ప్రవహించే ఆసియా ఖండపు అతి పొడవైన యాంగ్జీ నది ఆ దేశ ఆహార భద్రతకు, ఆర్థికవ్యవస్థకు కీలక ఆధారం. ఈ నదిని చైనా ఆహారం నుంచి అంతరిక్ష పరిశోధనల దాకా ఎన్నో అవసరాలకు విరివిగా ఉపయోగించుకుంటోంది. దీనిలో భాగంగా చైనా భారీస్థాయిలో డ్యామ్‌లు, హైడ్రోపవర్ ప్రాజెక్టులను నిర్మించింది. అవి జలచరాలపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. యాంగ్జీ ఉపనదుల్లో ఒకటైన చిషుయ్ హే (రెడ్రివర్)ను అరుదైన, స్థానిక చేప జాతులకు ఆవాసంగా పరిగణిస్తారు. అయితే, దానిపై కట్టిన డ్యామ్ లు, పవర్ స్టేషన్లు నీటి ప్రవాహాన్ని కట్టడి చేశాయి. గతంలో ఈ నది ప్రవహించిన ప్రాంతాలకు నీరందకపోవడంతో ఆ ప్రాంతాలు ఎండిపోయాయి కూడా. జీవవైవిధ్యం దెబ్బతినడం, కొన్ని జాతులు అంతరించేపోయే దశకు చేరుకోవడంపై పర్యావరణ వేత్తలు తీవ్ర ఆందోళనను వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో దీనిపై ఇప్పటివరకు కట్టిన 300 ప్రాజెక్టులను కూల్చివేసింది. మొత్తంగా ఉన్న 373 హైడ్రోపవర్ స్టేషన్లలో 342 చిన్నస్థాయి హైడ్రోపవర్ స్టేషన్ల కార్యకలాపాలు నిలిపివేసింది. ఒక చేప జీవజాలాన్ని, ఒక నది సహజత్వాన్ని కాపాడేందుకు 2020 నుంచి ఈ చర్యలు చేపడుతూ వస్తోంది. యాంగ్జీ స్టర్జన్ గా పేరుపొందిన స్టర్జన్ ఫ్యామిలీకి చెందిన చేపను 2022లో అంతరించిపోతున్న జాతిగా ప్రకటించారు. గతంలో అది యాంగ్జీ పరివాహక ప్రాంతమంతా కనిపించేది. 1970 నుంచి స్టర్జన్ సంతతి పడిపోతూ వస్తోంది. డ్యామ్ ల నిర్మాణం, అతిగా చేపలు పట్టడం వంటివి అందుకు కారణాలయ్యాయి. కాగా.. ప్రస్తుతం రెడ్ రివర్ పునరుద్ధరణ ప్రాజెక్ట్‌లో అవి మళ్లీ తమ ఉనికిని చాటుతాయనే భావన వ్యక్తమవుతోంది. 2023, 2024లో రెండు బ్యాచుల యాంగ్జీ స్టర్జన్లను నదిలోకి వదలగా.. అవి విజయవంతంగా నదిలో మనుగడ సాగించడం ప్రారంభించాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు. తద్వారా చైనా ఆహార భద్రతను పెంచుకోవడంతో పాటు, పర్యావరణాన్ని కూడా రక్షించుకుంటోంది.

## కవిత ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా తెలుసా?

- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ధ్వజం

**హైదరాబాద్, జూలై 12(మనం బ్యూరో):** గతంలో ఎన్నో బిల్లుల విషయంలో బీఆర్ఎస్ బీజేపీకి మద్దతిచ్చింది...కీలకమైన బీసీ బిల్లుపై మద్దతివ్వడానికి మాజీ సీఎం కేసీఆర్‌కు మనసు రావడం లేదా అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వ విప్లవాత్మక నిర్ణయాలని పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు కూడా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. కడుపు నిండా విషం పెట్టుకుని కౌగిలించుకున్నట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను మేము చేపట్టినప్పుడు కవిత తీహార్ జైలులో ఉన్నారు. జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారు. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో కనీసం ఆమెకైనా స్పష్టత ఉందా ? అని ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# ఆ ఆర్డినెన్స్ ఓ చిత్తు కాగితం

- అది బీసీలను మోసం చేసే కుట్ర
- రేవంత్ చేసిన కుల గణనకు చట్టబద్ధత లేదు?
- ఆర్డినెన్స్‌కు రాజ్యాంగభద్రత అసలే రాదు?
- పది మంది అడ్వకేట్ జనరల్స్ వచ్చినా ఈ ఆర్డినెన్స్ నిలబడదు?
- ఇప్పటికిప్పుడైతే కేసీఆర్ తెచ్చిన చట్టమే దిక్కు
- బీసీ బిడ్డలంతా న్యాయ పోరాటాలకు సిద్ధంగావాలే
- హైకోర్టు రిటైర్డ్ యాక్టింగ్ చీఫ్ జస్టిస్, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య

హైదరాబాద్, మనం ప్రతినిధి : 'కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నిట్ట నిలువునా వంచించింది. బీసీ బిడ్డలు న్యాయపోరాటానికి సిద్ధం కావాలి' అని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెస్తున్న ఆర్డినెన్స్.. చట్టం ముందు నిలబడేది కాదని, ఒక్క అడ్వకేట్ జనరల్ కాదు కదా?.. పది మంది అడ్వకేట్ జనరల్స్ వచ్చి వాదించినా కొట్టుడు పోతుందని కుండబద్దలు కొట్టారు. ఇప్పటికిప్పుడు రిజర్వేషన్ల బిల్లు వట్టి చెత్త కాగితమని, కాంగ్రెస్ వాళ్లు తెస్తామంటున్న ఆర్డినెన్స్ అంతకు మించి డొల్ల కాగితమని స్పష్టంచేశారు. ఈ బిల్లులు 9వ షెడ్యూల్ పరిధిలోకి వస్తేనే వాటికి రాజ్యాంగ భద్రత ఉంటుందని చెప్పారు. బీసీలకు ఎలాంటి హామీలు ఇవ్వకున్నా 1994 నుంచి 2018 వరకు అమలైన 34 శాతం బీసీ రిజర్వేషన్లను నిలుపుకోనేందుకు కేసీఆర్ ప్రయత్నం చేసినా కోర్టులు అడ్డుకున్నాయని గుర్తుచేశారు. రేవంత్ విఫల ప్రయత్నం చారిత్రక నిర్ణయమా.. రాహుల్గాంధీ ఆశయమంటూ డోలుబాజా వాయిస్తున్నారని ఎద్దేవాచేశారు.సుప్రీంకోర్టు ధర్మాసనం నిర్దేశించిన రిజర్వేషన్ పరిమితికి మించిన ఆర్డినెన్స్‌ను తేవడమనేది బీసీలను మోసం చేయడమేనని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను నిట్టనిలువునా వంచించారని, అధికారం వచ్చిన తర్వాత ఏడాదిలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి తీరా సమయం ముంచుకొచ్చిన తర్వాత డ్రామాలు చేస్తున్నారంటూ జస్టిస్ ఈశ్వరయ్య తనదైన శైలీలో మండిపడ్డారు.ఆర్టికల్ 31 సీ కింద రాష్ట్రపతికి పంపారు సంతోషమే. రాష్ట్రపతికి నేరుగా బిల్లు పంపటానికి రాష్ట్రాలకు అధికారం లేదు. రాష్ట్రపతి ఆమోదం పొందితేనే బిల్లుకు సంపూర్ణ చట్టబద్ధత వస్తుంది. బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఒక కాపీ రాష్ట్రపతికి పంపారు. కేంద్రం ఈ బిల్లుపై క్యాబినెట్లో చర్చించి, తెలంగాణ ప్రభుత్వం పంపిన రెండు సపరేట్ బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్లో పెట్టడానికి అంగీకరిస్తున్నామని ఆమోదం తెలుపుతూ ఉభయ సభల్లో చర్చకు పెట్టాలి. ఉభయ సభల్లో ఆమోదం పొందితే అప్పుడు బిల్లు రాష్ట్రపతి వద్దకు వెళ్తుంది. రాష్ట్రపతి ఆమోదిస్తే ఆర్టికల్ 31 బీ కింద 9వ షెడ్యూల్లో నోటిఫికేషన్ వస్తుంది. అగో అప్పుడు దానికి సంపూర్ణ చట్టబద్ధత వస్తుంది. దీన్ని ఏ కోర్టులూ కొట్టివేయజాలవు. ఉదాహరణకు.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకోండి. ఈ రిజర్వేషన్ల లిమిట్ దాటిందని చేస్తున్న వాదనలు తప్పు. వీటికి ఆర్టికల్ 38, 46 కింద రాజ్యాంగ సవరణ అయింది. ఆర్టికల్ 15(6), 16(6) సవరణతో 50 శాతం దాటింది. రాజ్యాంగ సవరణ అయితే దానికి ప్రొటెక్షన్ వస్తుంది.

**ఆర్డినెన్స్‌కు, కులగణనకు రాజ్యాంగ భద్రత ఏమేరకు ఉంటది?**

ఇప్పుడైతే ఆ బిల్లు వట్టి చెత్త కాగితం. వీళ్లు తెస్తామంటున్న ఆర్డినెన్స్ అంతకు మించి డొల్ల కాగితం. 342ఏ కింద సవరించిన రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన కులాల జనాభాను నిర్ధారించుకొనే హక్కు ఉన్నది. 342 ఏ (3) ప్రకారం ప్రతి రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసుకొని ఓబీసీలను గుర్తించి విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై సొంతంగా నిర్ణయం తీసుకోవచ్చు. ఆర్టికల్ 242 డీ (6), 242 టీ (6) కింద బీసీలకు కూడా జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ కులాల తరహాలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ కావాలి. లేదంటే రాష్ట్ర ప్రభుత్వం చేసిన బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలి. కానీ అంతకంటే ముందు రాజ్యాంగపరంగా ఫాలో కావాల్సిన ప్రొసీజర్ ఒకటి ఉంటుంది కదా! కుల గణన చేసిన తర్వాత ఎక్స్‌ఫర్ట్ కమిటీ చేశారు.అందులో ఎవరు ఎక్స్‌ఫర్ట్? వాళ్లు ఇంకా పరిశీలిస్తూనే ఉన్నారు. ఇన్ని రోజులు ఏం పరిశీలిస్తున్నారు? పోస్టుమార్టం చేస్తున్నారా? సర్వే రిపోర్టు ఇప్పటి వరకు పబ్లిక్ డొమైన్‌లో పెట్టారా? సర్వే కమిషన్ వేశారా? సింపుల్ విషయం.. ఈ రోజు ఆర్డినెన్స్ తీసిండ్రు. 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరణ చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసుకుంటం అని చెప్తున్నరు. ఎస్సీ, ఎస్టీలకు కూడా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు చేస్తామని చెప్తున్నరు. మొత్తం కలిపితే 67 శాతం అమలు చేస్తామంటున్నారు. 2018 పంచాయతీ ఎన్నికలప్పుడు కేసీఆర్ 34 శాతం అమలుకు ప్రయత్నం చేశారు.

పైగా ఆయన బీసీలకు అంత ఇస్తం, ఇంత ఇస్తం అని హామీలేమీ ఇవ్వలేదు. అయినా ఓ ప్రయత్నం చేసిండు. హైకోర్టు కుదరదు అంటే వెనక్కి వచ్చిండు. కుదరదు.. చట్టం ముందు నిలవదు అని హైకోర్టు చెప్పిన విషయాన్నే 'రెడ్డొచ్చే మొదలాయే' అన్నట్టు రేవంత్రెడ్డి భూజానికి ఎత్తుకున్నడు. దీన్ని చారిత్రక నిర్ణయం అని, రాహుల్ గాంధీ ఆశయమని గొప్పలకు పోతున్నారు. కానీ గౌరవ కోర్టుల్లో ఇది ఎట్టి పరిస్థితుల్లో నిలవదు. ఒక్క అడ్వకేట్ జనరల్ కాదు.. పది మంది అడ్వకేట్ జనరల్స్ వచ్చి వాదించినా కేసు నిలబడదు.. దేశ వ్యాప్తంగా పేరు మోసిన న్యాయవాదులంతా వచ్చి వాదించినా రేవంత్‌రెడ్డి తెచ్చిన ఆర్డినెన్స్‌కు కోర్టులు అంగీకరించవు. ఇట్లా అసంబద్ధంగా చట్టం చేసిన ఏ చట్టం నిలువదు.

**ప్రతిపక్షాలు సహకరించాలని ఓ మంత్రి అంటున్నారు?**

నేను కూడా విన్నా. ఏ రకంగా సహకరించాలి? వెనుబడిన జాతులకు సంక్రమించిన రాజ్యాంగబద్ధమైన హక్కులను త్యాగం చేయాలా? వంచించి మోసం చేస్తుంటే కడుపు చించుకోకుండా చేతులు కట్టుకొని నిలబడాలా? మీరు ఇలాంటి తెలివి తక్కువ నిర్ణయం తీసుకున్నా కోర్టులకు వెళ్లకుండా ఆగాలా? బీసీలకు ప్రతిపక్షాలు సాయం చేయవద్దని కోరుతున్నారా? ఆర్డినెన్స్ తీసుకురావల్సిన అవసరం ఏమున్నది? ఉభయ సభలను స్తంభింపజేసి, సభలను ఇప్పుడు సమావేశ పర్చలేమని చెప్పడం దారుణం. ఈడబ్ల్యూఎస్ సవరణ బిల్లు రెండు, మూడు రోజుల్లో పాసైంది. మీరు సమావేశాలు పెడితే చర్చ జరుగుతుంది కదా? లీగల్ ఎక్సపర్ట్స్ రిపోర్టులు ఇస్తారుకదా? ప్రతిపక్షం మాట్లాడుతుంది కదా? ఇలాంటిది ఏమీ చేయకుండా ప్రతిపక్ష పార్టీలు సహకరించాలని కోరడం ఏ రకమైన భావన అని ఆయన ప్రశ్నించారు.

**బీసీలు ఐక్యంగావాలే..**

బీసీలంతా ఐక్యంగా ఉండాలి. బీజేపీకి, కాంగ్రెస్‌కు ఏ ఇతర పార్టీలకూ బీసీలంటే చిత్తశుద్ధి లేదని హితవు పలికారు. బీసీలు ఇప్పటికైనా కండ్లు తెరిచి.. మన హక్కును మనం కాపాడుకోవడానికి ఉద్యమించాలన్నారు. న్యాయపోరాటాలకు సిద్ధం కావాలి. రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తెచ్చి అఖిలపక్షం ఏర్పాటు చేసే పరిస్థితులను కల్పించాలన్నారు.

అందరి ఒత్తిడి వల్ల కేంద్రాన్ని ఒప్పించి 9వ షెడ్యూల్లో కలిపేందుకు ప్రయత్నం చేస్తే విజయం సాధించవచ్చన్నారు. బీసీల పట్ల తమకు చిత్తశుద్ధి ఉన్నదని నిరూపించుకోవడానికి నిరాహార దీక్ష చేయాలని, అందులో ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతలు, స్థానిక బీజేపీ ఎంపీలు కూర్చోవాలని ఆయన సూచించారు.

## పైలట్లదే తప్పు?



- అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఏఏఐబీ ప్రైమరీ రిపోర్ట్
- నివేదిక పక్షపాతంగా ఉందంటూ అసంతృప్తి ప్రకటించిన పైలట్స్ అసోసియేషన్

**ఢిల్లీ, జూలై 12:** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై 'ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. జూన్ 12న ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో ఫ్లైట్లో ఉన్న 240 మంది ప్యాసింజర్లతో సహా ఇతరులు మరో 30 మందికిపైగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఏఏఐబీ కీలక విషయాలతో మొత్తం 15 పేజీలతో కూడిన ప్రాథమిక నివేదిక సమర్పించింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది.

ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్ ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని వెల్లడించింది. ఈ రెండు స్విచ్లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు నివేదికలో తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం కేవలం 32 సెకన్ల పాటు గాల్లో ఉన్నట్లు వెల్లడించింది. రన్‌వేకు కేవలం 0.9 నాటికల్ మైళ్ల దూరంలోని ఓ హాస్టల్ భవంతిపై విమానం కూలిపోయిందని నివేదిక వివరించింది. ఇంజిన్లు శక్తిని కోల్పోయిన తర్వాత ర్యామ్ ఎయిర్ టర్బైన్‌ను యాక్టివేట్ చేసినట్లు గుర్తించారు. ఇది యాక్టివేట్ అయినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కన్పించిందని ఏఏఐబీ తమ నివేదికలో వెల్లడించింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదన్న ఏఏఐబీ, ఈలోపే విమానం కూలిపోయిందని వివరణ ఇచ్చింది. ప్రమాదానికి ముందు ఇంధనం, బరువు సైతం పరిమితుల్లోనే ఉన్నాయని, విమానంలో ప్రమాదకరమైన వస్తువులు ఏమీ లేవని తన నివేదికలో స్పష్టం చేసింది. విమానంలో ఇంధనం కూడా స్వచ్ఛంగానే ఉందని, కలుషితమైన ఆనవాళ్లు లేవని తెలిపింది.

**పైలట్లు లేకుండానే దర్యాప్తు ఎలా చేస్తరంటూ ప్రశ్నించిన పైలట్స్ అసోసియేషన్**

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఏఏఐబీ ఇచ్చిన ప్రాథమిక నివేదికను ఎయిర్లైన్స్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఖండించింది. విచారణ జరిగిన తీరు, నివేదికలో వివరాలు వెల్లడించిన విధానం పైలట్లదే తప్పిదమనే అర్థం గోచరించేలా పక్షపాత ధోరణిలో ఉందని తన ప్రకటనలో పొందుపరిచింది. మీడియాకు లీక్ అయిన ఈ నివేదికపై బాధ్యతాయుత స్థానంలో ఉన్న ఏ అధికారి సంతకం లేదు. ఈ దర్యాప్తులో ఎలాంటి పారదర్శకత కనిపించలేదు. అత్యంత గోప్యంగా జరిగిన ఈ ప్రక్రియ ఎంతగానో ఆశ్చర్యపర్చింది. నిపుణులైన మరీ ముఖ్యంగా లైన్ పైలట్లు (షెడ్యూల్ ఫ్లైట్లు నడిపే వారు) ఆ దర్యాప్తులో భాగం కాలేదు'' అని ఆల్పా అధ్యక్షుడు సామ్ థామస్ అన్నారు. విమానం ఇంజిన్ ఇంధన స్విచ్ల అనుకోని కదలికలు దుర్ఘటనకు కారణమంటూ వాల్ స్ట్రీట్ జర్నల్లో వచ్చిన కథనాన్ని అసోసియేషన్ ప్రస్తావించింది. ఇలాంటి సున్నితమైన సమాచారం మీడియాకు లీక్ కావడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. పారదర్శకత కోసం పరిశీలకులుగా తమను విచారణలో భాగం చేసుకోవాలని కోరింది.

## శ్రీశైలం హైవేపై పది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

**మ.నగర్, జూలై 12 :** శ్రీశైలం పుణ్యక్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్తుండటంతో శ్రీశైలం జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో చూసేందుకు పర్యాటకులు భారీగా వెళ్తున్నారు. దీంతో అమ్రాబాద్ మండలం పాతాళగంగ నుంచి దోమలపెంట చెక్ పోస్టువరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. జాతీయ రహదారిపై 10 కి.మీ మేర వాహనాలు ఎక్కడికక్కడే



ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

## కంటెంట్ లేని వార్తలతో జర్నలిజం సతమతం

- విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్న పత్రికారంగం
- ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ అధ్యక్షులు విక్రమరావు పేరిట స్మారక ట్రస్ట్
- ఢిల్లీ సంతాప సభలో నిర్ణయం

**హైదరాబాద్/ న్యూఢిల్లీ, జులై 12, మనం ప్రతినిధి :** ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ అధ్యక్షులు దివంగత కె.విక్రమరావు పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఐఎఫ్‌డబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషనల్ క్లబ్ ఆఫ్ ఇండియా భవన్‌లో దివంగత విక్రమరావు సంతాపసభ జరిగింది.




ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు గోపాల్ మిశ్రా అధ్యక్షతన జరిగిన ఈ సంతాపసభలో విక్రమరావు స్మారక ట్రస్ట్ ఏర్పాటు ప్రకటన చేశారు.అదేవిధంగా విక్రమరావు జీవిత విశేషాలకు సంబంధించిన వివిధ కార్యక్రమాలతో కూడిన చిత్రాలు,విశిష్టతలతో కూడిన చరిత్ర పుస్తకాన్ని ముద్రించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన శ్రీగోపాల్ మిశ్రా ప్రసంగిస్తూ... పాత్రికేయ ప్రియతమ నాయకుడు విక్రమ్ రావు మృతి పట్ల విచారాన్ని వ్యక్తం చేస్తూ, భారతీయ జర్నలిజం నిజాయితీ గల సంప్రదాయాలను కాపాడుకోవడానికి పాత్రికేయులు విక్రమ్ రావు మార్గదర్శకత్వాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత మీడియా దృశ్యం మన ముందున్న ఒక విచిత్రమైన పరిస్థితిని ప్రతిబింబిస్తుందని, భారతీయ వార్తాపత్రికల విశ్వసనీయత, బహుశా తన 40 సంవత్సరాలకు పైగా జర్నలిజంలో అత్యల్ప స్థాయిలో ఉందన్నారు. ఈ కంటెంట్ కనుమరుగై, గొప్ప విజయాల గురించి కల్పిత వార్తలతో భర్తీ చేయబడిందన్నారు. పాకిస్తాన్‌లోని విలువల్లేని వార్తా సంస్థలతో అబద్ధాలను వ్యాప్తి చేయడంలో ప్రైవేట్ ఎలక్ట్రానిక్ ఛానెల్ లు పోటీ పడుతున్నాయని, పాకిస్తాన్‌లో మీడియా యూనిఫాం కింద ఉందని, భారతదేశంలో అలా లేరని, మన మీడియా యజమానుల్లో ఎక్కువ శాతం స్వార్థపరులున్నారని అన్నారు. ఈ సంతాప సభలో ఐఎఫ్‌డబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విపిన్ దులియా, ఉపాధ్యక్షులు ఉపేంద్ర సింగ్ రాథోడ్, పి.పరమేశ్వర రావు, కార్యదర్శులు పులిపలుపుల ఆనందం, శాంత కుమారి, విశ్వదేవ్ రావు, కోశాధికారి రజత్ కుమార్, వర్కింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్,బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, బి.రాజశేఖర్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ కంతేటి రమాదేవి, మహ్మద్ రఫీ,వర్కింగ్ కమిటీ సభ్యులు హసీబ్ సిద్దిఖీ(యూపీ), బెనుధర్ పాండ,ఇందుకాంత్ దీక్షిత్ తదితరులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు పాల్గొని దివంగత విక్రమ రావుకు నివాళులర్పించారు.

## ఓటర్ల జాబితాకు ప్రత్యేక సవరణ

- దేశవ్యాప్తంగా ఆగస్టు నుంచి ప్రారంభం



**ఢిల్లీ, జూలై 12 :** త్వరలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఆగస్టులో ఓటర్ల జాబితా సవరణని ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక సవరణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూనే ఈసీకి సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. బీహార్ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇదే ప్రక్రియను చేపట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాలే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సిద్ధమవుతున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు ఈసీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి షెడ్యూల్ని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలున్నాయి.

# చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సలహా కేంద్రం విజయవంతంగా సంవత్సరం పూర్తి

**చిత్తూరు, జూలై 12, మనం న్యూస్ :** ఈ ఒక్క సంవత్సరంలోనే జిల్లా వ్యాప్తంగా 482 కుటుంబాలలో తలెత్తిన సమస్యలు, విభేదాలను కుటుంబ సలహా కేంద్రం, కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించి, వాటిని మళ్లీ ఐక్యంగా చేయడంలో విజయవంతమైంది.ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన 52 కుటుంబాలు, విదేశాల నుండి వచ్చిన మూడు కుటుంబాలలో విభేదాలను సైతం పరిష్కరించి, అనుబంధాన్ని పునరుద్ధరించారు.సమాజ శ్రేయస్సు కోసం కుటుంబంలో స్థిరత్వం, మహిళల భద్రతే లక్ష్యంగా గత సంవత్సరం చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు, ఐపీఎస్ మార్గదర్శకతను, ప్రోత్సాహాన్నీ తోడుగా చేసుకొని చిత్తూరు పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్లో కుటుంబ సలహా కేంద్రం (ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్) ను 12-07-2024 న ప్రారంభించబడింది.ఈ కేంద్రం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు సుమారు 482 కుటుంబాలకు మానవీయ దృక్కోణంతో పరిష్కారం లభించింది. వివాహ జీవితంలో వచ్చిన సమస్యల నుంచి, కుటుంబ సభ్యుల మధ్య వచ్చిన అంతరాల వరకూ ఈ సలహా కేంద్రం వందలాది కుటుంబాలను మళ్లీ ఒకచోట కలిపే సానుకూల వేదికగా నిలిచింది. ఈ



సంవత్సరం కాలంలో 748 కుటుంబ సదస్సులు నిర్వహించబడ్డాయి. మానసిక నిపుణులు, చట్ట నిపుణులు, కౌన్సిలర్ల సహకారంతో 482 కేసులు సంతృప్తికరంగా పరిష్కరించబడ్డాయి. ' 181 మందిని గృహ హింస కేంద్రానికి సూచించబడింది. ' 58 మందిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయగా, 27 మందివి పెండింగ్లో ఉంది. అవగాహన కార్యక్రమాలు, మహిళా శక్తీకరణంపై శిక్షణలు, వర్క్షాప్లు నిర్వహించి మహిళలకు న్యాయబద్ధమైన మార్గదర్శకత కల్పించబడింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు, మాట్లాడుతూ 'మహిళల భద్రతకు ఇది ఒక చైతన్య వేదికగా మారింది. గత సంవత్సరం ప్రారంభించిన ఈ కుటుంబ సలహా కేంద్రం, సమస్యల పరిష్కారానికి ఒక దృఢమైన ఆధారంగా నిలుస్తూ సమాజంలో శాంతి, సుస్థిరతకు దోహదం చేస్తోంది. ప్రతి కుటుంబం సమాజానికి ఒక మూలస్తంభం. ఈ కేంద్రం ఆ మూలస్తంభాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోంది అని తెలిపారు. ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ద్వారా కుటుంబ సభ్యుల మధ్య పరస్పర నమ్మకాన్ని పెంపొందించడమే కాక, మహిళలు న్యాయంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పగలిగే ఒక విశ్వాస వేదికను ఏర్పరిచింది. చట్టపరమైన కౌన్సిలింగ్, మానసిక మద్దతు వంటి అనేక విభాగాల్లో బాధితులకు మార్గనిర్దేశనం అందిస్తోంది. గత ఏడాది ఈ కేంద్రం ప్రారంభోత్సవంలో, ఎస్పీ గారు స్వయంగా సదుపాయాలు పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లకు సూచనలు చేశారు. అదేవిధంగా, పోలీస్ అధికారులకు మహిళల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించేలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. సమాజ మార్పు ఒక్కరోజులో రాదు. కానీ ఒక మంచి ప్రణాళికతో, ప్రజల మద్దతుతో తప్పకుండా సాధ్యమే. ఈ కుటుంబ సలహా కేంద్రం అనేది మొదటి అడుగు. ఇది ఇప్పటివరకు చూపిన ఫలితాలు చూస్తే, భవిష్యత్తులో ఇది మరింత మంది జీవితాల్లో శాంతి, సమానత్వం తీసుకురాగలదని అంచనా. ఈ కేంద్రమే కాదు మన సమాజంలో ప్రతి ఒక్కరిలోనూ బాధ్యత ఉంటే, మహిళలపై హింసకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చు. ప్రతి వ్యక్తి ఈ మార్పులో భాగస్వామి కావాలి. మా వంతు కృషి. మీ మద్దతుతో సమాజంలో మంచి మార్పు తప్పకుండా వస్తుంది జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు అన్నారు.

# రాష్ట్ర దేవాదాయ శాఖ టీటీడీ సమన్వయ సమావేశం

తిరుమల,జూలై 12,మనం న్యూస్ః ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీ.ఆర్.నాయుడు, టీటీడీ కార్యనిర్వహణాధికారి జె. శ్యామలరావు, దేవాదాయ శాఖ కార్యదర్శి వినయ్ చంద్ కలిసి దేవాదాయ శాఖ, టీటీడీ మధ్య పెండింగ్లో ఉన్న పలు సంయుక్త అంశాలపై శనివారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ కూడా పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అనం రామనారాయణ రెడ్డి పత్రికల వారితో మాట్లాడుతూ దేవాదాయ చట్టం ప్రకారం 9 శాతం కామన్ గుడ్ ఫండ్ టీటీడీ నుంచి తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నాయి గతంలో 5 శాతం ఉన్న దానిని ఇప్పుడు 9 శాతం కు పెంచడానికి నిర్ణయం తీసుకున్నామని



తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగులుగా ఉన్న అర్చక స్వాములకు నిరుద్యోగ భృతి ఇవ్వాలనీ మేనిఫెస్టోలో నిర్ణయం తీసుకున్నామని ఆ మేరకు రాష్ట్రంలో 590 వేద పండితులు రాష్ట్రంలో నిరుద్యోగులుగా ఉన్నారని వారందరికీ 3 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించాం అని చెప్పారు. విజయవాడ దుర్గ గుడికి వెళ్లేందుకు మరో రోడ్డు మార్గం వేసేందుకు టీటీడీ సహకారం కావాలని కోరారు. టీటీడీలో అన్యమతస్థులు ఉండేది వాస్తవం

కేంద్ర మంత్రి బండి సంజయ్ టీటీడీలో పనిచేస్తున్న వేయి మంది అన్యమతస్థులు ఉన్నారన్న దానిపై విచారణ కొనసాగుతుందని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పునర్ నిర్మాణంలో ఉన్న ఆలయాలకు 147 కోట్లు విడుదల కాకుండా నిలిచిపోయాయి అని చెప్పారు. కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధుల విడుదల, శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మిస్తున్న ఆలయాల వివరాలు, ఆలయాల పునరుద్ధరణ, పరిరక్షణ, వాటి పురోగతి తదితర ముఖ్యమైన అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఈ సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ, దేవాదాయ శాఖ ఉపకార్యదర్శి సుధాకర్ రావు, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ జి.వి.ఆర్. శేఖర్, పలువురు టీటీడీ మరియు దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సత్యసాయి రథోత్సవేడుకలు



**శ్రీకాళహస్తి,జూలై 12,మనం న్యూస్ :** శ్రీ కాళహస్తి పట్టణంలో భగవాన్ శ్రీ సత్య సాయి వారి రథోత్సవేడుకలను శనివారం నాడు పట్టణ పురవీధులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి శ్రీ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ పాండురంగారావు మాట్లాడుతూ... భగవాన్ శ్రీ సత్య సాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని పేరిట శ్రీ స్వామివారి చిత్రపటాన్ని ఆవిష్కరించి భక్తులు స్వామివారి సంపూర్ణ అనుగ్రహం పొందలనే సదుద్దేశంతో ఈ ప్రేమ ప్రవాహిని కార్యక్రమాన్ని శ్రీ సత్య సాయి భగవాన్ ఆస్థానమైన పుట్టపర్తి దేవస్థానం నుండి మే 6వ తేదీన ప్రారంభించడం జరిగిందని ఈ ప్రేమ ప్రవాహిని రథోత్సవాలు జూలై 30 నాటికి పూర్తి అవుతుందన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణానికి ప్రేమ ప్రవాహిని రథోత్సవ మహోన్నత కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు అమర్నాథ్, మాజీ ఉపాధ్యక్షులు వరప్రసాదుల అధ్యక్షతన సమీతి సేవ గ్రామ మైన కొత్తకండ్రిగలో శనివారం ఉదయం ప్రేమ ప్రవాహిని రధాన్ని ప్రారంభించి అనంతరం శ్రీకాళహస్తి పట్టణంలో ముత్యాలమ్మ గుడివీధిలో ఉన్న భగవాన్ శ్రీ సత్య సాయిమందిరం వద్ద వుంచి విశేషంగా పూజలు, భజనలు నిర్వహించి పురవీధులలో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ రథోత్సవ కార్యక్రమంలో భక్తులు, మహిళా విశేషంగా స్వామివారి ఊరేగింపులో పాల్గొని కర్పూర నీరాజనాలు నారికేళాలు సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శ్రీ సత్య సాయి సేవ సమితి అధ్యక్షులు, కమిటీ సభ్యులు, వాలంటీర్లు, భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

# డ్రైవర్ హత్య కేసులో శ్రీకాళహస్తి జనసేన ఇంచార్జ్ కోట వినుత అరెస్ట్

**శ్రీకాళహస్తి,జూలై 12, మనం న్యూస్ :** శ్రీకాళహస్తి జనసేన ఇంచార్జ్ కోట వినుత దంపతులను తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. వారి వ్యక్తిగత సహాయకుడు మరియు డ్రైవర్ అయినటువంటి శ్రీనివాసులు అలియాస్ రాయుడు (25) మృతి కేసులో కోటా వినూత ఆమె భర్త చంద్రబాబుపై తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల జూలై 8వ తారీఖున తమిళనాడులోని మింట్ పరిధిలోని కూవం నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి చేతి మీద జనసేన పార్టీ గుర్తుతో పాటుగా కోటా వినూత పేరు కూడా ఉండడంతో దర్యాప్తును ముమ్మరం చేసిన పోలీసులు శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇంచార్జ్ కోటా వినూత ఆమె భర్త చంద్రబాబును విచారించి మృతదేహం ఆమె డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడిదిగా పోలీసులు నిర్ధారించారు. ఈ కేసు విచారణలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. శ్రీ కాళహస్తి లోని గౌడన్లో డ్రైవర్ శ్రీనివాసులను చిత్రహింసలకు గురిచేసి హత్య చేసి తమిళనాడు కూవం నదిలో పడేసినట్లు



పోలీసులు గుర్తించారు. డ్రైవర్ శ్రీనివాసులు హత్యకు రెండు వారాల ముందే అతడిని విధుల నుంచి తొలగించినట్లు పోలీసుల విచారణలో తెలుస్తుంది పోలీసులు అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోస్టుమార్టం రిపోర్టులో శ్రీనివాసులు హత్యకు గురైనట్టు నివేదికలు వచ్చాయి. సీసీటీవీ ల పుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తును ముమ్మరం చేసిన ఆధారాలను సేకరించారు. సీసీటీవీ ఫుటేజ్ లో ఉన్న వాహనం నెంబర్, వ్యక్తులను గుర్తించిన చెన్నై పోలీసులు శ్రీకాళహస్తి చేరుకున్నారు. శ్రీకాళహస్తిలోని జనసేన పార్టీ ఇన్చార్జ్ కోటా వినుత, కోట చంద్రబాబు, జనసేన పార్టీ ఐటీ వింగ్ శివకుమార్, గోపి, రేణిగుంటకు చెందిన షేక్ తసన్ లను ఈ కేసులో అనుమానితులుగా అనుమానిస్తూ విచారణ నిమిత్తం పోలీసులు వారిని అరెస్ట్ చేసి తమిళనాడు కోర్టులో హాజరు పరచారు న్యాయమూర్తి వారికి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. శ్రీకాళహస్తి లోని బొక్కసం గ్రామానికి చెందిన శ్రీనివాసులు గత కొంతకాలంగా కోటా వినూత వ్యక్తిగత సహాయకుడిగా మరియు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏం జరిగిందో తెలియదు గానీ గత నెల జూన్ 21వ తారీఖున శ్రీనివాసులు చేసిన ద్రోహానికి అతనిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఇకపై శ్రీనివాసులకు తమకు ఎలాంటి సంబంధం లేదు అంటూ సోషల్ మీడియాలో కోటా వినూత ప్రకటించారు. ఈ క్రమంలోనే శ్రీనివాసులు హత్య జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పోలీసులు తెలిపారు. శ్రీనివాసులు మృతి కేసు కు సంబంధించి కోటా వినూతపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కోటా వినుతను జనసేన పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు జనసేన పార్టీ ప్రకటించింది.

# గోరక్షే శ్రీరామరక్ష

- గో ఆధారిత పంచగవ్యపై శిక్షణ
- నవంబర్‌లో మూడు రోజులు జాతీయ స్థాయి సదస్సు
- కంచి మఠం విద్యాపీఠం నిరంజన్ వర్మ గురూజీ వెల్లడి



**తిరుపతి,జూలై 12(మనం న్యూస్) :** సమస్త మానవాళి మంచి ఆరోగ్యానికి గో ఆధారిత పంచగవ్య ఔషధాలే ప్రధానమని, ఇందుకు గోరక్షే శ్రీరామరక్ష అని కంచి మఠం విద్యాపీఠం పంచగవ్య ఆచార్యులు నిరంజన్ వర్మ గురూజీ పేర్కొన్నారు. శనివారం సాయం సంధ్య వేళ శ్రీవారి పాదాల చెంత నెలకొన్న అలిపిరి గోశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గో పాదయాత్ర నిర్వహించిన బాలకృష్ణ గురు స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ నెల 14 నుంచి 16 వరకు మూడు రోజులపాటు జాతీయస్థాయిలో సదస్సు నిర్వహించి 2000 మంది పైగా దేశం నలుమూలల నుంచి హాజరయ్యే గో బంధువులకు పంచగవ్య ఔషధాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి నగరంలో నిర్వహించ తలచడం అభినందనీయమని అభయ హస్త గోవింద సేవా మండలి సభ్యులు చంద్రమౌళి, జగన్నాథం, రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండ్రాజు సుకుమార్ రాజు, ఆర్ఎస్ఎస్ పద్మనాభరెడ్డి, కనుమూరి గీతాంజలి, ఝాన్సీ లక్ష్మీబాయి, ప్రసన్న లక్ష్మి, శ్రీపతి తదితరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి స్థానికులుగా తమ వంతు సహాయ సహకారాలు సంపూర్ణంగా అందిస్తామని వారు తెలిపారు. మానవ మనుగడకు పంచేంద్రియాలు ఎలా ఉపయోగపడతాయో గోవు నుంచి లభించే పంచగవ్యాలు మంచి ఆరోగ్యానికి ఉపయుక్తమవుతా యన్నారు. ఈ సమావేశంలో శ్రీ వినాయక సాగర్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబశివారెడ్డి ఉపాధ్యక్షులు సుకుమార్ సహాయ కార్యదర్శి సాయి కృష్ణంరాజు, శివ ప్రసాద్ రాజు, శ్రీపతి, కనుమూరి గీతాంజలి, ప్రసన్న, లక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో టీటీడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**తిరుమల, జూలై 12,మనం న్యూస్ :** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని శనివారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయం అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర



దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూ లైన్ ద్వారా ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీ.ఆర్ నాయుడు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ టీటీడీ మరియు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు తొలి సమావేశం జరగనుందని ఈ సమావేశంలో టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం మరియు భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే టీటీడీలో పనిచేస్తూ పదవి విరమణ పొందిన ఉద్యోగులు, అర్చకులు మరియు అనేకమంది ఉద్యోగస్తులకు సమస్యలు ఉన్నాయని వారి సమస్యలను కూడ ముఖ్యమంత్రికి నివేదించి వారి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. తిరుమలలో నుంచే మొదటగా ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని అన్నారు. ఆలయ ప్రాంగణాలలో దైవ నామ స్మరణ మినహా మరే ఇతర కార్యక్రమాలు నిర్వహించరాదని ముఖ్యమంత్రి ఆదేశించారని అలాగే శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక భావన ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్రంలోని 161 ప్రధాన ఆలయాలలో ప్రసాదాల క్వాలిటీ మరియు దర్శనాల విధి విధానాలను మెరుగుపరిచామని అలాగే దేవాదాయ శాఖ నుంచి కామన్ గుడ్ ఫండ్ కింద రెండు వందల ఆలయాల పునర్నిర్మాణానికి, ధూప దీప నైవేద్యాలకు నోచుకోలేని ఆలయాలలో కూడా ధూప దీప నైవేద్యాలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

# శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి వైభవంగా పుష్పయాగం

**తిరుపతి,జూలై 12,మనం న్యూస్ :** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయంలో జూన్ 07వ తేదీ నుండి 15వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం విదితమే. నిత్యకైంకర్యాల్లో గానీ, బ్రహ్మోత్సవాల్లో గానీ, అర్చక పరిచారకుల వల్ల, అధికారుల వల్ల, భక్తుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటిని నివత్తి చేసుకునేందుకు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఇందులో భాగంగా ఉదయం 11 గంటల నుంచి



మధ్యాహ్నం 12 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి స్నపనతిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. ముందుగా పుష్పయాగం కోసం వినియోగించే పుష్పాలను ఆలయంలో మూలమూర్తి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ప్రదక్షిణగా వెళ్లి మాడ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారిని కొలువుతీర్చారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం వైభవంగా జరిగింది. తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి 12 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో పుష్పయాగం నిర్వహించారు. ఒక టన్ను పుష్పాలను ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి టిటిడి సరఫరా చేసింది. ఆద్యంతం శోభాయమానంగా సాగిన ఈ పుష్పయాగ మహోత్సవాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. ఆ తరువాత వీధి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఇతర ఆధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు

**తిరుమల, జూలై 12,మనం న్యూస్ :** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ఈవో జె. శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలోని సీఆర్వో కార్యాలయాన్ని ఆధునీకరించేందుకు



చేపట్టిన ప్రణాళికలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. భవిష్యత్తులో యాత్రికుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా అధునాతన సౌకర్యాలతో సీఆర్వోను ఆధునీకరించేందుకు ఉన్న అవకాశాలను అధికారులతో ఆరా తీశారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5 భవనాన్ని పరిశీలించి వెయిటింగ్ హాళ్లు, శుభ్రత, భద్రత ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ తనిఖీల్లో టీటీడీ చీఫ్ ఇంజనీర్ సత్య నారాయణ, ఈఈ శ్రీ వేణు గోపాల్, డీఈ చంద్ర శేఖర్, డిప్యూటీ ఈవోలు భాస్కర్, సోమన్నారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాముడు, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన అధికారులను అభినందించిన టీటీడీ చైర్మన్

**తిరుమల, జూలై 12,మనం న్యూస్ :** ఇటీవల అమెరికాలో జరిగిన ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన టీటీడీ విజిలెన్స్ మరియు నిఘా విభాగం అధికారులు సురేంద్ర, రామ్ కుమార్ లు శనివారం తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడును



మర్యాదపూర్వకంగా కలిసి తమ పతకాలను చూపారు. టీటీడీ ప్రతిష్ట మరింత పెంచేలా విజయం సాధించిన ఇరువురు భద్రతాధికారులను టీటీడీ చైర్మన్ అభినందించారు.

## కొత్త మిత్రులూ పాత మిత్రులూ!



కొత్త మిత్రులను తయారుచేసుకో
కానీ పాతమిత్రులనూ భద్రంగా కాపాడుకో
కొత్త మిత్రులు 'వెండి'
పాతమిత్రులు 'బంగారం'!
కొత్త మిత్రుత్వాలు కొత్త ద్రాక్షామధువు వంటివి;
అనుభవమున్న పాతమిత్రుత్వమే

దానిని పరిపక్వం, పరిశుద్ధం చేస్తుంది సుమా!
కాలం,మార్పు పెట్టే పరీక్షకు తట్టుకుని నిలబడిన
మిత్రుత్వాలే నిస్సంశయంగా ఉత్తమమైనవి;
సొగసైన కనుబొమ వికారమై ముడతపడొచ్చు,
నీలకేశాలు నెరవొచ్చు
మిత్రుత్వానికి మాత్రం ఎన్నటికీ
నాశన మనేది తెలియదు!

పాతమిత్రుల మధ్యే ప్రయత్నించి
ఉండి చూశాను నిజం-
వాళ్ళ మధ్య ఉంటే మన యౌవనోత్సాహాలను
మళ్ళీ నవీకరించుకుంటాం
కానీ-పాతమిత్రులు, అయ్యో!మరణించొచ్చు
వారి ఖాళీని కొత్త మిత్రులు పూరించాలి!

మిత్రబంధాన్ని నీ గుండెలో
అపురూపంగా పెంచుకో-
కొత్త మిత్రుత్వం మంచిది...
కానీ పాత మిత్రుత్వం అత్యుత్తమం
కొత్త మిత్రులను తయారుచేసుకో
కానీ పాతమిత్రులను భద్రంగా కాపాడుకో
కొత్త మిత్రులు 'వెండి'
పాతమిత్రులు 'బంగారం'!

**ఆంగ్లమూలం:**
**జోసెఫ్ పారీ (1841-1903)**
స్వేచ్ఛాకవితానువాదం:
**- 'రఘువర్మ'**
9290093933

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# నైపుణ్యంతోనే దేశానికి ఆర్థికాభివృద్ధి



ప్రపంచ జనాభా సమస్యలు, స్థిరమైన అభివృద్ధి కోసం జనాభా సవాళ్లను పరిష్కరించడం యొక్క ప్రాముఖ్యతపై దృష్టిని పెట్టడానికి ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటాము. సామాజిక, ఆర్థిక, పర్యావరణ శ్రేయస్సు కోసం జనాభా ప్రభావాలతో సహా దాని పెరుగుదల యొక్క వివిధ అంశాల గురించి అవగాహన పెంచడం ఈ రోజు లక్ష్యం. జూలై 11, 1987న ప్రపంచ జనాభా దాదాపు ఐదు బిలియన్లకి చేరుకోవడంతో ప్రపంచ బ్యాంకులో సీనియర్ జనాభా అధ్యయన అధికారి (డెమోగ్రాఫర్) కె.సి.జకారియా ఈరోజును సూచించారు. ఈ సంవత్సరం 2025, ప్రపంచ జనాభా దినోత్సవం పిలుపు ' న్యాయమైన మరియు ఆశాజనకమైన ప్రపంచంలో వారు కోరుకునే కుటుంబాలను సృష్టించడానికి యువతను శక్తివంతం చేయడం. అంటే యువతకు వారి భవిష్యత్తును రూపొందించడానికి హక్కులు, సాధనాలు అవకాశాలు ఉన్నాయని నిర్ధారించు కోవాలని పిలుపునిస్తుంది. ప్రపంచ జనాభా గడియారం ప్రకారం జనవరి 1, 2025 నాటికి ప్రపంచం 8.2 బిలియన్ల మందితో ఉంది. మన భూమి అధిక జనాభాతో ప్రమాదం కలిగియున్నది. జనాభాను నియంత్రించి భూమిని రక్షించుకోవాలి. ప్రపంచంలో అతి తక్కువ జనాభా ఉన్న దేశాలు వాటికన్, మొనాకో, జిబ్రాల్టర్ మొదలైనవి వేలాది జనాభాతో మాత్రమేయున్నవి.

సహజ వనరుల మాదిరిగానే దేశ ఆర్థికాభివృద్ధిలో మానవ వనరుల ప్రాముఖ్యత ఎక్కువ. ఉత్పాదకతకు దోహదం చేయడం ద్వారా సహజ వనరులను వినియోగించదగిన వస్తువులుగా మారుస్తాయి. మానవ మూలధనంలో పెట్టుబడి అనగా విద్య, శిక్షణ, ఆరోగ్య సంరక్షణ పై పెట్టుబడి రాబడిని ఇస్తుంది.. మానవఅభివృద్ధి అనేది 'సమాజంలోని ప్రజలందరి జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంచే ప్రక్రియ. అత్యున్నత నైపుణ్యం కలిగిన మానవ వనరుల ఆధారిత దేశాలు జపాన్, దక్షిణ కొరియా, చైనా, జర్మనీ యునైటెడ్ స్టేట్స్. అవి నైపుణ్యం కలిగిన మానవ వనరులతో అభివృద్ధి చెందిన దేశాలుగా మారాయి. కాబట్టి ఏ దేశం అయినా మానవ మూలధనాన్ని మెరుగుపరచడం అవసరం.

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారింది. రాబర్ట్ మాల్థస్ సిద్ధాంతం ప్రకారం భారతదేశం రెండవ దశను ఎదుర్కొంటోంది, ఇక్కడ జనన రేటు ఎక్కువగా ఉంటుంది. మరణాల రేటు తక్కువగా ఉంటుంది. భారతదేశం జనాభాలో 62.5% మంది 15-59 సంవత్సరాల వయస్సులో ఉన్నారు, ఇది 2036 నాటికి గరిష్ట స్థాయి సుమారుగా 65% కి చేరుకుంటుంది. ఈ జనాభా ధోరణులు జనాభా డివిడెండ్ (లాభం) లభ్యత 2055-56 వరకు కొనసాగుతుంది. ఎకనామిక్ సర్వే 2018-19 ప్రకారం, భారతదేశ జనాభా డివిడెండ్ 2041 నాటికి గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ఆ సమయంలో పని చేసే వయస్సు వాటా, అనగా 20-59 సంవత్సరాల, జనాభా 59%కి చేరుతుందని అంచనా. భారతదేశంలో డెమోగ్రాఫిక్ డివిడెండ్ అవకాశాలు ప్రపంచంలోని ఇతర దేశాల కంటే ఎక్కువ. పని చేసే వయస్సు జనాభాలో 65% కంటే ఎక్కువ మందితో భారతదేశం ఆర్థిక సూపర్ పవర్‌గా ఎదుగుతుంది. రాబోయే దశాబ్దాలలో ఆసియా యొక్క శ్రామికశక్తిలో భారతదేశం సగానికి పైగా సరఫరా చేస్తుంది. జనాభా ధోరణులు యొక్క అవకలన ప్రవర్తన కారణంగా ఈ డెమోగ్రాఫిక్ డివిడెండ్ వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు సమయాల్లో అందుబాటులో ఉంటుంది. అందువల్ల ప్రజలకు నైపుణ్యాలను పెంపొందించడానికి భారతదేశం ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. 2025 మానవ అభివృద్ధి నివేదికలో, భారతదేశం 193 దేశాలలో 130వ స్థానంలో ఉంది. ఈ ర్యాంకింగ్ దేశం యొక్క పురోగతిని ప్రతిబింబిస్తుంది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం విడుదల చేసిన ఈ నివేదిక భారతదేశాన్ని మధ్యస్థ మానవ అభివృద్ధి దేశంగా వర్గీకరిస్తుంది.

మనం భారతదేశానికి సవాళ్లను చూసినప్పుడు పని-వయస్సు నిష్పత్తిలో పెరుగుదల భారతదేశంలోని కొన్ని పేద రాష్ట్రాల్లో కేంద్రీకృతమై ఉంటుంది. భారతదేశం ఈ జనాభా కోసం లాభదాయకమైన ఉపాధి అవకాశాలను సృష్టించగలిగితేనే జనాభా డివిడెండ్ పూర్తిగా గ్రహించబడుతుంది. భారతీయ శ్రామిక శక్తిలో నైపుణ్యం లేకపోవడం పెద్ద సవాలు. భవిష్యత్తులో సృష్టించబడే కొత్త ఉద్యోగాలలో చాలా వరకు అత్యంత నైపుణ్యం కలిగి ఉంటాయి. తక్కువ మానవ మూలధనం మరియు నైపుణ్యాల



కొరత కారణంగా భారతదేశం అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవచ్చు. అందువల్ల, భారతీయ శ్రామిక శక్తిని సమర్థవంతంగా నైపుణ్యం కలిగినదిగా చేయడానికి ఆరోగ్యం విద్య అవకాశాలు గణనీయంగా మెరుగుపరచాలి. భారతదేశంలో జనాభా పరివర్తన ప్రయోజనాలను పొందడంలో భారతదేశంలో ఆర్థిక వ్యవస్థ యొక్క స్వభావం మరొక అడ్డంకి. పారిశ్రామికీకరణ, గ్లోబలైజేషన్, నాల్గవ పారిశ్రామిక విప్లవం సాంకేతిక పురోగతి కారణంగా భవిష్యత్ వృద్ధి నిరుద్యోగంగా మారుతుందనే ఆందోళన పెరుగుతోంది. 20 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న జనాభాలో దాదాపు 41% ఉన్న భారతదేశం, మెరుగైన విద్యా వ్యవస్థతో మాత్రమే జనాభా డివిడెండ్ను పొందగలదు. ఆరోగ్య సంరక్షణ, అవస్థాపనలో అభివృద్ధి, యువ శ్రామిక శక్తికి అధిక సంఖ్యలో ఉత్పాదక రోజులను నిర్ధారిస్తుంది, తద్వారా ఆర్థిక వ్యవస్థ ఉత్పాదకత పెరుగు తుంది. వ్యాపారాల ఆసక్తులు, వ్యవస్థాపకతను ప్రోత్సహించడం పెద్ద శ్రామిక శక్తికి ఉపాధిని కల్పించడానికి ఉద్యోగ కల్పనలో సహాయ పడుతుంది. ప్రపంచ బ్యాంకు యొక్క వ్యాపార సులభతర సూచికలో భారతదేశం మెరుగైన 63వ ర్యాంక్ సాధించడం శుభసూచకం.

దేశంలోని మానవ వనరుల నైపుణ్యాల మెరుగుదలకు ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, ఉద్యోగాలు నైపుణ్యాల కోసం పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది, ఇది మానవ మూలధనాన్ని నిర్మించడంలో సహాయపడుతుంది. ఇది ఆర్థికవృద్ధికి తోడ్పడటం, తీవ్ర పేదరికాన్ని అంతం చేయడంలో సహాయపడుతుంది ప్రభుత్వం భారతదేశంలో 500 మిలియన్ల మందికి నైపుణ్యం పెంచడం అనే లక్ష్యంతో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ని స్థాపించింది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భారతదేశ నైపుణ్య అభివృద్ధి దృశ్యాన్ని పెంచడంలో గణనీయమైన పురోగతి సాధించింది. లక్షలాది మంది వ్యక్తులకు శిక్షణ ఇచ్చింది, పరిశ్రమ భాగస్వామ్యాలను సులభతరం చేసింది. అంతర్జాతీయ నైపుణ్య చైతన్యం మరియు గ్రీన్ ఉద్యోగాలను ప్రోత్సహించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషించింది. 40.3 మిలియన్లకు పైగా అభ్యర్థులకు శిక్షణ ఇచ్చింది. 9.4 మిలియన్ల నియామకాలను పొందింది. ఉన్నత విద్యా సంస్థలలో 21 ఫ్యూచర్ స్కిల్స్ సెంటర్లను స్థాపించింది. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా ఇప్పటివరకు దాదాపు 1.37 కోట్ల మంది నైపుణ్యం పొంది ఉద్యోగాల కోసం సిద్ధమయ్యారు. దేశంలో నైపుణ్యాభివృద్ధి మౌలిక సదుపాయాలకు మద్దతు ఇవ్వడానికి ఇప్పటివరకు 720 కి పైగా ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రాలుస్థాపించబడ్డాయి.

మనం భారతదేశానికి సవాళ్లను చూసినప్పుడు పని-వయస్సు నిష్పత్తిలో పెరుగుదల భారతదేశంలోని కొన్ని పేద రాష్ట్రాల్లో కేంద్రీకృతమై ఉంటుంది. భారతీయ శ్రామిక శక్తిలో నైపుణ్యం లేకపోవడం పెద్ద సవాలు. భవిష్యత్తులో సృష్టించబడే కొత్త ఉద్యోగాలలో చాలా వరకు అత్యంత నైపుణ్యం కలిగి ఉంటాయి. తక్కువ మానవ మూలధనం మరియు నైపుణ్యాల కొరత కారణంగా భారతదేశం అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవచ్చు. అందువల్ల, భారతీయ శ్రామిక శక్తిని సమర్థవంతంగా నైపుణ్యం కలిగినదిగా చేయడానికి ఆరోగ్యం విద్య అవకాశాలు గణనీయంగా మెరుగుపరచాలి. దేశంలో జనాభా పరివర్తన ప్రయోజనాలను పొంద డంలో ఆర్థిక వ్యవస్థ యొక్క స్వభావం మరొక అడ్డంకి. పారిశ్రామికీకరణ, గ్లోబలైజేషన్, నాల్గవ పారి శ్రామిక విప్లవం సాంకేతిక పురోగతి కారణంగా భవిష్యత్ వృద్ధి నిరుద్యోగంగా మారుతుందనే ఆందో ళన పెరుగుతోంది. 20 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న జనాభాలో దాదాపు 41% ఉన్న భారతదేశం, మెరుగైన విద్యా వ్యవస్థ, ఆరోగ్య సంరక్షణ, అవస్థాపనలో అభివృద్ధి, యువ శ్రామిక శక్తి ద్వారా ఆర్థిక వ్యవస్థ ఉత్పాదకత పెరుగుతుంది. వ్యాపారాల ఆసక్తులు, వ్యవస్థాప కతను ప్రోత్స హించడం పెద్ద శ్రామిక శక్తికి ఉపాధిని కల్పిం చడానికి ఉద్యోగ కల్పనలో సహాయపడు తుంది. ప్రపంచ బ్యాంకు యొక్క వ్యాపార సులభతర సూచికలో భారతదేశం మెరుగైన 63వ ర్యాంక్ సాధించడం శుభసూచకం. స్టార్ట్-అప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి పథకాలు సక్రమంగా అమలు చేయబడితే ఆశించిన ఫలితాన్ని అందిస్తాయి. విధాన రూపకర్తలు ఈ జనాభా మార్పుతో అభివృద్ధి విధానాలను సమలేఖనం చేస్తే, వేగ వంతమైన సామాజిక- ఆర్థిక అభివృద్ధికి బంగారు అవకాశాన్ని అందిస్తుంది. ఈ జనాభా పరివర్తన దానితో పాటు సంక్లిష్టమైన సవాళ్లను కూడా తెస్తుంది. శ్రామికశక్తికి తగిన నైపుణ్యం, విద్యావంతులకు లాభదాయకమైన ఉపాధిని అందించకపోతే, జనాభా విపత్తును ఎదుర్కొంటాము. జపాన్, కొరియా వంటి దేశాల నుండి నేర్చుకోవడం దేశీయ సంక్లిష్టతలను పరిగణనలోకి తీసుకుని పరిష్కారాలను రూపొందించడం ద్వారా, మనం జనాభా డివిడెండ్ యొక్క ప్రయోజనాలను పొందగలుగు తాము.

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# యువతే దేశ భవిష్యత్తు



'నేర్చుకోవడం పట్ల మక్కువ పెంపొందించుకోండి. మీ ఎదుగుదలను ఎవరు ఆపలేరు'- ఆల్బర్ట్ ఐన్ స్టీన్

ప్రపంచ జనాభాలో 1.2 బిలియన్ల మందికి పైగా యువత (15-24 సంవత్సరాల వయస్సు) నివసిస్తోంది. అయితే, ఈ యువతలో అధికభాగం నిరుద్యోగం, 40% తగిన శిక్షణలేమి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల లోపం వంటి సమస్యలతో బాధపడుతోంది. ఆధునిక టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో పాత విద్యా విధానాలు వాటికి తగ్గట్టు మారకపోవడం, యువతను పోటీ ప్రపంచానికి సన్నద్ధం చేయడంలో విఫలమవుతోంది. ఇది కేవలం ఉపాధి సమస్యే కాదు, సమాజ ఆర్థిక అభివృద్ధికి, స్థిరతకు పెద్ద ప్రమాదం.

నైపుణ్యాలు కేవలం ఉద్యోగం పొందడానికి మాత్రమే కాదు, అవి వ్యక్తిగత స్వావలంబన, ఆత్మవిశ్వాసం, ఆవిష్కరణకు మూలస్తంభాలు అవుతాయి. సాఫ్ట్ స్కిల్స్ (ఇంటర్ పర్సనల్ నైపుణ్యాలు), టెక్నికల్ స్కిల్స్ (సాంకేతిక నైపుణ్యాలు), డిజిటల్ లిటరసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్ వంటి రంగాల్లో శిక్షణతో యువత అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను గెలుచుకునే స్థాయికి




చేరగలుగుతున్నారు. వ్యవసాయం, హస్తకళలు, సాంప్రదాయ నైపుణ్యాల శిక్షణతో గ్రామీణ యువత తమ జీవనోపాధిని మెరుగుపరుస్తున్నారు. ఇది నగరాలకే పరిమితమవకుండా దేశం మొత్తాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించగలదు.

యునెస్కో, ఐఎల్వో, యునిడో, యునిసెఫ్ వంటి అంతర్జాతీయ సంస్థలు యువత నైపుణ్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అనేక కార్యక్రమాలు ప్రారంభించాయి. గ్లోబల్ ఇనిషియేటివ్ ఆన్ డీసెంట్ జాబ్స్ ఫర్ యూత్, స్కిల్స్ ఫర్ యూత్ వంటి ప్రణాళికలు ప్రపంచ వ్యాప్తంగా అమలవుతూ యువతకు శిక్షణ, నైపుణ్యం, ఉపాధి కల్పనకు దోహదపడుతున్నాయి. ఈ చర్యలు ప్రతి దేశం తమ స్థాయిలో అనుసరించాల్సిన మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. కమ్యూనికేషన్, జట్టు కృషి, సమస్యల పరిష్కారం, భావోద్వేగ నియంత్రణ, మొదలగు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి.

భారత ప్రభుత్వం 2015లో ప్రారంభించిన 'స్కిల్ ఇండియా మిషన్' ద్వారా లక్షలాదిమంది యువత శిక్షణ పొందుతున్నారు. [illegible] వంటి పథకాల ద్వారా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యాల వికాసం జరుగుతోంది. అయితే, ఇంకా ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి - నాణ్యత కలిగిన శిక్షణల కొరత, సాంకేతిక రంగాల్లో శిక్షణ లోపాలు, మహిళా యువతకు తగిన అవకాశాల కొరత మొదలైనవి. సమస్యలకు పరిష్కారంగా పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాలు, డిజిటల్ శిక్షణ వనరులు, మొబైల్ ట్రైనింగ్ ల్యాబ్లు వంటి విస్తృత అవకాశాలు కల్పించాలి.

నైపుణ్యాల అభివృద్ధి మన దేశపు భవిష్యత్ నిర్మాణానికి బలం అందించే మూలసాధనం. యువతకు తగిన శిక్షణ, అవకాశాల ద్వారా వారి సృజనాత్మకత, ఆవిష్కరణలకు అడ్డుకట్టలు తొలగించాలి. యువతకు అవకాశాల కల్పన అనేది మన బాధ్యత మాత్రమే కాదు, అది సమాజ వికాసానికి పెట్టుబడి. నైపుణ్యం అనేది సంపద - అది వ్యక్తిని వెలుగులోకి తీసుకురావడమే కాదు, ప్రపంచ స్థాయిలో పోటీ నివ్వగల సామర్థ్యం కలిగిన వారు అవుతారు. సమర్థవంతమైన యువతతోనే సుస్థిర సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

**- వెంకటరమణ గిలకత్తుల**
9866878769

# పరిశ్రమల్లో రక్షణ కావాలి!



భారతదేశం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది, ఇది శుభ పరిణామం. అయితే, ఈ ఎదుగుదల వెనుక మన కార్మికుల ప్రాణాలు, ఆరోగ్యం ప్రమాదంలో పడుతున్నాయనే చేదు వాస్తవం ఉంది. ప్రపంచంతో పోటీపడాలని చూస్తున్నా, కర్మాగారాల్లో తరచూ జరుగుతున్న దుర్ఘటనలు, ముఖ్యంగా ఇటీవలి ఘోర సంఘటనలు, పరిశ్రమల్లో భద్రతా విధానాలపై తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత విచారణలు, నష్టపరిహారాలు ఇవ్వడం పరిష్కారం కాదు. అసలు ప్రమాదాలే జరగకుండా నివారించే పద్ధతులను పాటించాలి. ప్రతి ప్రాణం విలువైనదే అని మనం గుర్తించాలి.



**రక్షణ చట్టాలు - అమలులో సవాళ్లు:**

గతంలో కర్మాగారాల్లో రక్షణకు సంబంధించి మన దేశంలో అనేక చట్టాలు ఉండేవి. కర్మాగారాల చట్టం 1948, గనుల చట్టం 1952 వంటివి వాటిలో కొన్ని. వీటిని సరళీకృతం చేసి, సమగ్రంగా అమలు చేసే ఉద్దేశంతో వృత్తి రక్షణ, ఆరోగ్యం, పని పరిస్థితుల నిబంధనావళి 2020 (సురక్షా నిబంధనావళి) తీసుకురాబడింది. ఇది 13 పాత కార్మిక చట్టాలను ఒకే నిబంధనావళి కిందకు తెచ్చి, చిన్న పరిశ్రమలను కూడా చేర్చింది. యజమానులు సురక్షితమైన పని వాతావరణం, వ్యక్తిగత రక్షణ పరికరాలు, ప్రమాదాలపై శిక్షణ ఇవ్వడం తప్పనిసరి. అలాగే ప్రమాదాలను అంచనా వేసి నివారించాలి, ప్రమాదకర పనులు చేసేవారికి వైద్య పరీక్షలు చేయించాలి. పెద్ద కంపెనీలు రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి.

ఈ సురక్షా నిబంధనావళితో పాటు, పర్యావరణ పరిరక్షణ చట్టం 1986, ప్రమాదకర రసాయనాల తయారీ, నిల్వ, దిగుమతి నిబంధనలు 1989 వంటివి రసాయన భద్రత, వ్యర్థాల నిర్వహణ గురించి వివరిస్తాయి. రాష్ట్ర అగ్నిమాపక చట్టాలు, జాతీయ భవన నియమావళి అగ్ని ప్రమాదాల నివారణకు మార్గదర్శకాలు అందిస్తాయి. ఇలా బలమైన చట్టాలు ఉన్నప్పటికీ, ముఖ్యంగా చిన్న, అసంఘటిత రంగాల్లో వీటిని పటిష్ఠంగా అమలు చేయడంలోనే అసలైన సవాలు ఉంది.

**ప్రమాదాల పరంపర - చేదు వాస్తవం:**

2023 నుండి 2025 మధ్య కాలంలో దేశంలో కర్మాగారాల్లో ప్రమాదాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా రసాయన, మందుల తయారీ పరిశ్రమల్లో ఇవి ఎక్కువగా జరుగుతున్నాయి. ఇది వ్యవస్థలోని లోపాలను స్పష్టం చేస్తోంది. ఇటీవలే, జూన్ 2025లో తెలంగాణలోని పసమైలారంలో ఉన్న సిగాచి పరిశ్రమల డ్రైయర్ పేలుడు 35 మందికి పైగా కార్మికుల ప్రాణాలు తీసి, డజన్ల మందిని గాయపరిచింది. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అత్యంత ఘోరమైన పారిశ్రామిక ప్రమాదంగా నిలిచింది. అలాగే ఆగస్టు 2024లో ఆంధ్రప్రదేశ్లోని అచ్యుతాపురంలో ఎసెన్షియా మందుల కర్మాగారంలో పేలుడు వల్ల 17 మంది, ఏప్రిల్ 2024లో తెలంగాణలోని సంగారెడ్డిలో ఎస్బి ఆర్గానిక్స్ పేలుడులో నలుగురు మరణించారు. ఈ ప్రమాదాలు సరిగా నిర్వహణ లేకపోవడం, సిబ్బందికి సరైన శిక్షణ లేకపోవడాన్ని చూపించాయి.

కర్మాగారాల్లో ప్రమాదాల తాజా పూర్తి అధికారిక వివరాలు వెంటనే అందుబాటులో ఉండవు. 2017 నుండి 2020 కాలానికి కర్మాగారాల సలహా సేవలు, కార్మిక సంస్థల డైరెక్టరేట్ జనరల్ నివేదిక ప్రకారం, నమోదైన కర్మాగారాలలో ప్రతిరోజూ సగటున ముగ్గురు కార్మికులు చనిపోతున్నారు, పదకొండు మంది గాయపడుతున్నారు. ఇండస్ట్రియల్-ఆల్ ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య డిసెంబర్ 2024 నివేదిక ప్రకారం, 2024లో పని ప్రదేశాల్లో 400 మందికి పైగా కార్మికులు మరణించారు. ఈ సంఖ్యలు తక్కువగా నమోదు కావడం వల్ల వాస్తవానికి ఇంకా ఎక్కువగా ఉండవచ్చని ఈ నివేదికలు చెబుతున్నాయి.

**ప్రమాదాల మూల కారణాలు - లోతైన సమస్యలు:**

ప్రమాదాలు పదేపదే జరగడానికి అనేక కారణాలున్నాయి. చట్టాల అమలులో లోపాలు ప్రధానం. తనిఖీ సిబ్బంది కొరత, సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, పారదర్శకత లోపించడం వల్ల నిబంధనలు పాటించని కంపెనీలపై చర్యలు ఉండటం లేదు. పరిశ్రమల్లో రక్షణకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం మరో కారణం; దీనిని వ్యాపారంలో అంతర్భాగంగా చూడటం లేదు. తగినంత శిక్షణ, అవగాహన లేకపోవడం పెద్ద సమస్య, ముఖ్యంగా ఒప్పంద కార్మికులకు. పాతబడిన యంత్రాలు, నిర్వహణ లోపాలు ప్రమాదాలకు దారితీస్తాయి. చిన్న పరిశ్రమలు ఆర్థికంగా బలహీనంగా ఉండటం వల్ల రక్షణ పెట్టుబడులను పక్కన పెడతాయి. కాంట్రాక్ట్ కార్మికులు సరైన ఉద్యోగ భద్రత, శిక్షణ లేకపోవడంతో ఎక్కువ ప్రమాదాలకు గురవుతారు. చాలా చిన్న యూనిట్లు ఆధునిక రక్షణ సాంకేతికతలను ఉపయోగించడం లేదు. చివరికి, ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనే వ్యవస్థలు సరిగా లేకపోవడం, సరైన ప్రణాళికలు, పరికరాలు, సమన్వయం లేకపోవడం వల్ల ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతోంది. నివాస ప్రాంతాలు పరిశ్రమలకు దగ్గరగా ఉండటం వల్ల ప్రజలకూ ముప్పు పొంచి ఉంది.

**ముందుకు సాగే మార్గం - జాగ్రత్తగా ఉండే సంస్కృతిని నిర్మిద్దాం:**

కార్మికులను, ప్రజలను రక్షించాలంటే కర్మాగారాల రక్షణ కోసం ఒక బలమైన ప్రణాళికను అమలు చేయాలి. నిబంధనల అమలును బలోపేతం చేయాలి - తనిఖీ అధికారుల సంఖ్యను పెంచి, శిక్షణ, వనరులు ఇవ్వాలి. డిజిటల్ విధానాలతో నిజ-సమయ సమాచారం నమోదు చేసి, నిబంధనలు పాటించనివారికి కఠినమైన జరిమానాలు విధించాలి. వివిధ ప్రభుత్వ విభాగాలు కలిపి తనిఖీ కమిటీలను ఏర్పాటు చేయాలి. ముందే జాగ్రత్తపడే రక్షణ సంస్కృతిని పెంచుకోవాలి. పై స్థాయి అధికారులు, యాజమాన్యం రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. కార్మికులను రక్షణ నిర్ణయాలలో పాలుపంచుకునేలా ప్రోత్సహించాలి. శిక్షణ, నైపుణ్యాలను పెంచడంలో పెట్టుబడి పెట్టాలి. కార్మికులందరికీ, ముఖ్యంగా ఒప్పంద కార్మికులకు, ప్రమాదాలను గుర్తించడం, సురక్షితంగా పని చేయడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించడంపై సమగ్రమైన శిక్షణను తప్పనిసరి చేయాలి. రక్షణలో సాంకేతికత, కొత్త ఆవిష్కరణలను విరివిగా ఉపయోగించాలి. నిజ-సమయ పర్యవేక్షణకు సెన్సార్లు, యంత్ర నిర్వహణకు కృత్రిమ మేధస్సు, శిక్షణకు వర్చువల్ రియాలిటీని ప్రోత్సహించాలి. ప్రమాదకర పరిశ్రమలకు ప్రక్రియ రక్షణ నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి. 'హజార్డ్ అండ్ ఆపరేబిలిటీ' అధ్యయనాలను తప్పనిసరి చేసి, అమలు చేయాలి. చివరగా, అత్యవసర సంసిద్ధత, ప్రతిస్పందనను బలోపేతం చేయాలి. స్థానిక అధికారులు, ఆసుపత్రులు, విపత్తు నిర్వహణ సంస్థలతో సమన్వయం చేసుకుని అత్యవసర ప్రణాళికలను అభివృద్ధి చేయాలి. తరచుగా మాక్ డ్రిల్స్ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలి. అసంఘటిత రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి సురక్షితమైన పద్ధతులను అవలంబించడానికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

**నైతిక బాధ్యత:**

భారతదేశం ప్రపంచంలో ఒక పెద్ద పారిశ్రామిక శక్తిగా ఎదగాలంటే, అది తన ప్రజల రక్షణ, ఆరోగ్యానికి పూర్తి నిబద్ధతతో కూడి ఉండాలి. ఇటీవలి విషాదాలు నిర్లక్ష్యం వల్ల కలిగే కనిపించని నష్టాలను గుర్తు చేస్తున్నాయి. నిబంధనలను కఠినంగా అమలు చేయడం, రక్షణకు ప్రాధాన్యత ఇచ్చే విధానాన్ని పెంచడం, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా, భారతదేశం తన పారిశ్రామిక రంగాన్ని మార్చగలదు. అప్పుడు ఎదుగుదల ప్రాణనష్టం లేకుండా, మానవ విలువలకు పెద్ద పీట వేస్తూ సాగుతుంది. ఇది కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదు, నైతిక బాధ్యత, స్థిరమైన అభివృద్ధికి మూలం కూడా.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

## ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గత నెల రోజులుగా అనేక బోధనేతనేతర పనులతో ఒత్తిడికి గురవుతున్నారు. యోగాంధ్ర కార్యక్రమం, విద్యా కిట్ల పంపిణీ, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ తదితర పనులలో నిమగ్నం కావడంతో బోధనకు కుంటుపడుతున్నది. ప్రస్తుతం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇవ్వబడిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్ల వివరాలను యాప్ నందు పొందుపరిచి విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులచే బయోమెట్రిక్ వేయవలసిందిగా విద్యాశాఖ సూచిస్తోంది కానీ పాఠశాలల నందు బయోమెట్రిక్ డివైస్ లేకపోవడం వాటి వినియోగం గురించి ఎటువంటి అవగాహన ఉపాధ్యాయులకు లేకపోవడంతో మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఉపాధ్యాయులకు ఈ బోధనేతర పనులు వద్దని ఉపాధ్యాయులు కోరుతున్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం విద్యా కిట్ల పంపిణీకి సంబంధించిన బయోమెట్రిక్ ను వేయించే పని నుంచి ఉపాధ్యాయులను తప్పించి సిఆర్పిలు లేదా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు కేటాయించవలసిందిగా కోరుతున్నారు . కాబట్టి బోధనేతర పనులు నుంచి ఉపాధ్యాయులకు తప్పించి బోధనకు పాటుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**- వాసిలి సురేష్**
9494615360

## ముసుగుల కాలం



కనబడేవి అన్నీ కూడా
అమాయక ముసుగులే!

ఎక్కడ పలకరించి చూసిన
చెట్టుమీద వాలిన పిట్ట అరుపులే!

అంతా కల్తీ పొట్లలను చేసుకొని
అవసరాల నిమిత్తం నవ్వే ప్లాస్టిక్ పువ్వులే!

ఏ వైపులా నుండి చురకత్తులకు
మత్తుభూసి
గమత్తుగా నారాయణ మంత్రం
చదువుతారో!

ఒకరిమీద ఒకరికి నమ్మకాల రంగులు
పూసుకుంటూ...
ఒలక బోసిన ప్రేమలతో అవకాశ
కట్టింగులు చూపిస్తుంటారు!

మనుషులు మారక మనసులు కదలక
బుద్ధిమాలిన్యపు కపట
ప్రేమల బొమ్మలను తగిలించుకొని
మనలో మేక,పులుల రూపంలో
కనబడుతున్న కోకొల్లల రూపాలు!

కలికాలంలో ఆశల అలలపై
ఉన్నవాడి కెరటాలు వీస్తూ
లేనివారి బతుకుల బీటల జలముపై
ముసుగుల కాలపు పవనాలు
చిత్తడిచేసీ భూకంపాల గాలులై
వీస్తున్నాయి!

**- డాక్టర్ పగిడిపల్లి సురేందరు**
8074846063

# సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి

- జిల్లా మహాసభలు జగ్గయ్యపేట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా మహాసభల నిర్వహణ
- సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపు



జగ్గయ్యపేట జులై 12 (మనం న్యూస్): ఆగస్టు ఒకటి రెండు తేదీలలో జగ్గయ్యపేటలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను జగ్గయ్యపేట చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహిద్దామని సభలలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు.భారత కమ్యూనిస్టు పార్టీ ( సి పి ఐ )కి ఎంతో ఘన చరిత్ర కలిగిన జగ్గయ్యపేటలో ఆగస్టు నెల 1,2 తేదీలలో జరగనున్న ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం ఆర్టీసీ డిపో రోడ్డు లోని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ద్వితీయ మహాసభల వివరాలను ఆయన వెల్లడించారు. ఆగస్టు ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు డిపో సెంటర్లో ఉన్న పిల్లలమర్రి భవన్ నుండి బలుసుపాడు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అదే సెంటర్లో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు.2వ తేదీ ప్రతినిధుల మహాసభ జరుగుతుందని ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆయన కోరారు. ఒకటవ తేదీన జరిగే ప్రదర్శనలో వేలాదిమంది కార్మికులు కర్షకులు, రైతులు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఎన్టీఆర్ జిల్లాలో పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందిన జగ్గయ్యపేటను పారిశ్రామిక కారిడార్ గా ప్రకటించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జగ్గయ్యపేట ప్రాంతంలో కార్మిక సంఘాలను స్థాపించి కార్మికుల పక్షం గా ఎన్నో పోరాటాలను చేసిన మాజీ శాసనసభ్యులు పిల్లల మర్రి వెంకటేశ్వర్లు కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలపై అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిన ఘన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందన్నారు. జగ్గయ్యపేటలో రైల్వే స్టేషన్ ఏర్పాటు, డంపింగ్ యార్డ్ తరలింపు, నియోజకవర్గంలోని మున్నేటి పై ఏర్పాటు చేసిన పోలంపల్లి ప్రాజెక్టు తో పాటు లింగాల వద్ద ఉన్న బ్రిడ్జి,కే.అగ్రహారం వద్ద పాలేటి పై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరినందున నూతనంగా బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలపై కూడా ఈ మహాసభలలో చర్చించి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ద్వితీయ మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ,సహాయ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి జూనె బోయిన శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి మాశెట్టి రమేష్ బాబు, మండల సహాయ కార్యదర్శులు భోగ్యం నాగులు,షేక్ కరీం,నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు బ్రో

## ఈగల్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ ఐపిఎస్




విజయవాడ తూర్పు, జూలై 12(మనం న్యూస్): డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ ఈగల్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ ఐపిఎస్ , డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె.జి.వి. సరిత ఐ.పి.ఎస్., విద్యార్థిని విద్యార్థులకు సూచన చేశారు.. మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణాపై కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు,ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మరియు రాష్ట్ర ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ (ఈగిల్) వింగ్ డైరెక్టర్ ఎకె రవి కృష్ణ అన్నారు.. మాదక ద్రవ్యాల వినియోగం, వాటి దుష్పరిణామాలపై ఈ రోజు విజయవాడ లోని సిద్ధార్థ ఫార్మసిటికల్ కాలేజీలో జరిగిన డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదాన్ని చేస్తూ విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు.. ఉన్నత విద్యలో గంజాయి, కొకైన్ మరియు హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు బలైపోతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం పై ఈగల్ డైరెక్టర్ రవి కృష్ణ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.. నిషేధిత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడుచేసుకోవద్దని, ప్రస్తుతం గంజాయి, బ్రౌన్ షుగర్, హెరాయిన్, కొకైన్, చెర్రస్ తదితర మాదకద్రవ్యాలకు బానిసలై, కొంత మంది యువత తమ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె.జి.వి. సరిత ఐ.పి.ఎస్. ఆవేదన వ్యక్తం చేశారు.. ఎవరు పైన అనుమానం ఉన్నట్లయితే 1972 నెంబర్కు కాల్ చేసి సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు..

## కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం



- మంత్రి నారాయణ

విజయవాడ పశ్చిమ,జూలై 12 (మనం న్యూస్): మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి పి.నారాయణ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల డిమాండ్లను సాధ్యమైనంతవరకూ పరిష్కరించాలని సీఎం చంద్రబాబు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఆదేశించారని తెలిపారు. కార్మికుల డిమాండ్లపై కేబినెట్ సబ్ కమిటీ పలు మార్లు చర్చించిందన్నారు. కార్మికులకు మేలు చేసేలా మంత్రివర్గ ఉపసంఘం సానుకూల నిర్ణయం తీసుకుందన్నారు. ఆర్థిక శాఖతో చర్చించి ప్రభుత్వ నిర్ణయాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం

- ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్


విజయవాడ పశ్చిమ,జూలై 12 (మనం న్యూస్): శనివారం దేవస్థాన కార్యాలయంలో నగర పోలీస్ శాఖ అధికారులు, దేవస్థానం సిబ్బంది, వైదిక సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్ మాట్లాడారు. హైదరాబాద్ వంటి ప్రాంతాల నుండి కొన్ని గంటల్లోనే విజయవాడ చేరుకుని కుమ్మరి పాలెం సెంటర్ నుండి దేవస్థానం పైకి చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని భక్తులు పేర్కొన్న విషయాల పై ప్రత్యామ్నాయ దారులు



గురించి, టోల్ గేట్ మార్పు చేయడం గురించి చర్చించారు. మునిసిపల్ ఆఫీస్ వద్ద హోల్డింగ్ ఏరియా అభివృద్ధి, కనకదుర్గ నగర్, దుర్గాఘాట్ లో ఇన్ఫర్మేషన్ సెంటర్స్ ఏర్పాటు, భక్తుల సౌకర్యార్థం పాలనా వికేంద్రీకరణ క్రింద కొండ దిగువునే పలు సౌకర్యాల ఏర్పాటు గురించి పోలీస్ అధికారులకు ఈవో వివరించారు. కొండ దిగువున దేవస్థాన ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయ సంస్కృతి ప్రతిభింభిచేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు జి. రామకృష్ణ, దుర్గారావు, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ కోటేశ్వరరావు, రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## తీవ్ర జ్వరంతోనూ పోలీస్ విచారణకు

# హాజరైన మాజీ ఎమ్మెల్యే వంశీ



హనుమాన్ జంక్షన్, జూలై 12(మనంన్యూస్): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ తీవ్ర జ్వరం తోనూ శనివారం ఉదయం పోలీస్ స్టేషన్ లో విచారణకు హాజరయ్యారు. ఇళ్ల పట్టాల కేసులో శనివారం ఆయన పోలీస్ స్టేషన్ కు విచారణకు హాజరయ్యారు. ఆయన ముక్కు రంధ్రం పూడిపోవడంతో శ్వాస తీసుకోవడానికి సమస్య ఏర్పడగా ఆపరేషన్ కోసం ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఆపరేషన్ తర్వాత గుండెకు సంబంధించి సమస్య వచ్చినట్లుగా డాక్టర్లకు అనుమానం రావడంతో శనివారం ఉదయం వైద్యులు ఆయనకు ఎన్జియోగ్రామ్ చేశారు. ఈ క్రమంలో ఆయన తీవ్ర జ్వరానికి లోనయ్యారు. అయినా కోర్టు ఆదేశాలను గౌరవించి వీరవల్, హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ కు వచ్చారు. సంతకాలు చేశారు. ఆయనను కలసెందుకు అభిమానులు తరలివచ్చారు.ఆరోగ్య పరిస్థితులు సహకరించకపోయినా.. న్యాయ వ్యవస్థ మీద ఉన్న గౌరవంతో పోలీస్ స్టేషన్లకు వెళ్లడం జరుగుతుందని వంశీ మోహన్ తెలిపారు. విచారణ తర్వాత తిరిగి వైద్యం కోసం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు.

## చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే

# నాకు భద్రత తొలగించారు

- కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక

గుడివాడ, జూలై 12 (మనం న్యూస్): చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే కృష్ణా జిల్లా చైర్మన్ గా తనకు భద్రతను ప్రభుత్వం తొలగించిందని కృష్ణా జిల్లా చైర్మన్ ఉప్పాల హారిక మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నాడు గుడివాడలోని కే కన్వెన్షన్ లో జరుగుతున్న వైసీపీ సమావేశంలో పాల్గొనేందుకు గుడివాడ హారిక దంపతులు వచ్చారు. అయితే అప్పటికే గుడివాడలో రగులుకున్న ఫ్లెక్సీ వివాదం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఇదే అదనుగా నాగవరప్పాడు సెంటర్లో జడ్పీ చైర్మన్ దంపతులను టిడిపి శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో కృష్ణా జిల్లా చైర్మన్ ఉప్పాల హారిక దంపతులను గుడివాడ వన్ టౌన్ కు పోలీసులు తరలించారు. ఈ నేపథ్యంలో సుమారు గంటసేపు పైగా కారులోనే ఉప్పాల హారిక దంపతులు ఉన్నారు. అయితే ఇదే సమయంలో జడ్పీ చైర్మన్ హారిక పై ఓ ఆకతాయి అసభ్య పదజాలంతో దుర్భాషలాడినట్లు తెలుస్తోంది. దీంతో ఆగ్రహానికి గురయిన చైర్మన్ హారిక భర్త కారులో నుండి దిగే ప్రయత్నం చేశారు. పోలీస్ బందోబస్తు నడుమ జడ్పీ చైర్మన్ దంపతులను పోలీసులు వన్ పోలీసు స్టేషన్ కు తరలించారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన తర్వాత జిల్లా ప్రథమ పౌరురాలిని అయిన తనకు జరిగిన అవమానంతో జడ్పీ చైర్మన్ హారిక కన్నీటి పర్యంతమయ్యారు. మహిళ అని కూడా



చూడకుండా తనను దుర్భాషలాడారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా గుడివాడలో టిడిపి శ్రేణులు వ్యవహరించారంటూ పట్టణ వైసీపీ ఇంచార్జ్ ఉప్పాల రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఒక్క సారిగా రాష్ట్ర రాజకీయం వేడెక్కింది. అటు టిడీపి శ్రేణులు, మరో పక్క వైసిపి శ్రేణుల ఆగ్రహ జ్వాలల మధ్య పోలీసులు శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు.

## మాజీ మంత్రి పేర్నినానిపై పోలీసులకు ఫిర్యాదు



మచిలీపట్నం, జూలై 12 (మనం న్యూస్): మాజీ మంత్రి పేర్ని నాని పై ఆర్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. హింసను ప్రేరేపించేలా పేర్ని నాని మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ... పేర్ని నానిని తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.గత మూడు రోజులుగా జిల్లాలో జరుగుతున్న వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో మాజీమంత్రి పేర్ని నాని పాల్గొని అభ్యంతరకర పదజాలంతో రప్పా.. రప్పా.. డైలాగ్ తో హింసను ప్రేరేపించేలా ప్రసంగాలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా వీడియోలను వైరల్ చేస్తున్నారు.పేర్ని నాని వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో పేర్ని నానిపై టిడిపి నాయకులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు సయ్యద్ ఖాజా, మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రమణ్యం, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, టిడిపి నగర అధ్యక్షుడు స్వామి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## దక్షిణ మధ్య రైల్వే జీఎంగా సంజయ్ బాధ్యతల స్వీకరణ



విజయవాడ పశ్చిమ,జూలై 12 (మనం న్యూస్): ఇండియన్ రైల్వే మేనేజ్మెంట్ సర్వీస్ (ఐ.ఆర్.ఎం.ఎస్ ) కు చెందిన సంజయ్ కుమార్ శ్రీవాస్తవ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్గా బాధ్యతలు స్వీకరించారు. 1988 బ్యాచ్ ఇండియన్ రైల్వే ఇంజనీరింగ్ సర్వీస్ (ఐ.ఆర్.ఎస్.ఈ) కు చెందిన ఆయన ఈ పదవికి పూర్వం సెంట్రల్ ఆర్గనైజేషన్ ఆఫ్ రైల్వే ఎలక్ట్రిఫికేషన్ (సి.ఓ.ఆ.ఈ ) జనరల్ మేనేజర్గా పనిచేశారు. సివిల్ ఇంజనీరింగ్కు సంబంధించిన వివిధ సాంకేతిక పురోగతులు , విధానాలను అమలు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆర్.డి.ఎస్.ఓ, ఆర్.ఐ.టి.ఈ.ఎస్, రైల్వే బోర్డులో విశిష్టమైన కెరీర్తో, ఆయన రైల్వే మౌలిక సదుపాయాలు, మెట్రో ప్రాజెక్టులు మరియు అధునాతన రైలు సాంకేతికతల అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతూ తన నాయకత్వ పటిష్ట లక్షణాలను సుస్థిరం చేసుకున్నారు.

## ఘనంగా గ్రామాల్లో సుపరిపాలనలో

# తొలి అడుగు కార్యక్రమం



ఆదోని, జూలై 12 (మనం న్యూస్): మండలంలోని గోనుబావి, ఉనూరు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప,ఘనంగా ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ చేరి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ సంకల్పం ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి చేర్చడం. చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోనే ప్రజలకు గుణకారంగా పనిచేసే సుస్థిర పాలన సాధ్యం అవుతుంది అని పేర్కొన్నారు. గ్రామస్తులు టిడిపి నాయకులను సాధారణంగా ఆహ్వానించగా, సమస్యలు స్థానిక సమస్యలు పరిష్కారం కోసం వినతులు సమర్పించారు, నాయకులు వాటిని శ్రద్ధగా విని,ఇది కేవలం ప్రారంభం మాత్రమే ప్రజలకు అన్యాయం జరిగితే ప్రతి ఒక్కరం ఉద్యమానికి వెనకడుగు వేసే పరిస్థితి ఉండదని, నాయకులు స్పష్టం చేశారు. గ్రామస్తులు టిడిపి నాయకులను సాధారణంగా ఆహ్వానించగా, సమస్యలు స్థానిక సమస్యలు పరిష్కారం కోసం వినతిలు సమర్పించారు నాయకులు వాటిని శ్రద్ధగా విని ఇది కేవలం ప్రారంభం మాత్రమే ప్రజలకు అన్యాయం జరిగితే ప్రతి ఒక్కరం ఉద్యమానికి వెనకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంల టిడిపి పార్టీ సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, సౌదీ రూఫ్, మాజీ కౌన్సిలర్లు రామచంద్ర, మల్లికార్జున, ఫక్రుద్దీన్, సోమశేఖర్ రెడ్డి, ఎల్ఎల్సీ రామస్వామి, గోపాల్ రెడ్డి, జీ హోసల్లి రఘునాథ్ రెడ్డి, తెలుగు యువత వెంకటేష్ చౌదరి,ఇస్వి శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప, టిడిపి సోషల్ మీడియా కార్యకర్తలు, స్థానిక యువత, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుడివాడలో టిడిపి, జనసేన గుండాల దాడి ఉన్మాద చర్య



- బీసీ లకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ లు క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి వెలంపల్లి

గుడివాడ, జూలై 12 (మనం న్యూస్): కృష్ణాజిల్లా జడ్పీ చైర్మన్ ఉప్పల హారిక పై శనివారం నాడు గుడివాడ నియోజకవర్గంలో టిడిపి, జనసేన గుండాలు దాడికి పాల్పడ్డారని మాజీ మంత్రి, వైసిపి నేత వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఉప్పల హారిక కారుపై రాళ్లతో, కర్రలతో దాడి చేసి, కారును ధ్వంసం చేసి ఉప్పల హారిక వెళ్లేటువంటి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వెళ్ళనీయకుండా కూటమి గుండాలు అడ్డుపడడాన్ని ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి గుండాలు ఉన్మాదుల్లా ప్రవర్తిస్తున్నారని, ఒక బీసీ మహిళపై ఈ రకంగా దాడి చేయడం హేయమన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఇలా ప్రజా ప్రతినిధుల పైన, జిల్లా ప్రథమ పౌరురాలు అయినా బీసీ మహిళ పైన దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్ రాష్ట్రంలో ఉన్న బీసీలకు క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు.

# పేర్నినాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం

- కొనకళ్ళ నారాయణ



మచిలీపట్నం, జూలై 12 (మనం న్యూస్): శారదానగర్లో శనివారం ఆత్మీయ సమావేశానికి ఏపీఎస్ ఆర్టీసీ కొనకళ్ళ నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మీడియా మనం న్యూస్ ప్రతినిధి ప్రత్యేకంగా ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణరావు ను పలకరించగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ఫలితాల్లో జగన్ మోహన్ రెడ్డి నిరంకుశ, అవినీతి పరిపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పి.. ప్రతిపక్ష హోదా దక్కకుండా.. ఘోరంగా ఓడించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కనీవినీ ఎరుగని రీతిలో కూటమి ప్రభుత్వం అత్యంత అధిక మెజార్టీతో అధికారాన్ని ఇచ్చారు. మీరు ఓడిపోయిన అవమానంతో, అసూయతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారు. రప్పా.. రప్పా.. చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి.. తలలు లేచిపోవాలి.. అని పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం..? మాజీ మంత్రిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని ప్రజాస్వామ్యన్ని రక్షించేవిధంగా మాట్లాడాలి. కానీ, హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడటం దారుణం. ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుంది.. సీఎం చంద్రబాబు సారధ్యంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో హింసను ఎట్టిపరిస్థితుల్లో ప్రోత్సహించరు. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తు.. అవినీతి మయంగా, ఆరాచకంగా మార్చారు. గతంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలపై దాడులు చేసి, హత్యలు చేశారు. అది మీ సంస్క ృతి.. ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పేర్ని నాని మీద బందరులో ఎన్ని అభియోగాలు ఉన్నాయి.. ఎన్ని నేరాలు చేశావ్.. గోడౌన్ లో రేషన్ బియ్యం ఎక్కడికి పోయాయి. రంగనాయకుల గుడి 10 ఎకరాల స్థలానికి ఏమి సమాధానం చెప్తావ్.. బీచ్ పక్కన ఉన్న గుడిసెలను తగలబెట్టారు.. దానికి ఏమి సమాధానం చెప్తావ్.. దమ్ము ఉంటే అక్కడికి వెళ్లి మాట్లాడాలి.. పేర్ని నాని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ్మిన వారి సత్రానికి చెందిన 1000 గజాల స్థలాన్ని అక్రమించుకున్నారు. పేర్ని నాని తండ్రి పేర్ని విష్ణుమూర్తి ఎనాడూ కూడా హింసను ప్రోత్సహించే విధంగా మాట్లాడలేదు. కానీ, నీ ప్రవర్తన ధోరణి మీ నాయకుడు మెచ్చుకునే విధంగా ఉంది. హింసను ప్రోత్సాహించి.. పరుష పదజాలంతో వేరే పార్టీ వారిని తిడితే మీ నాయకుడికి ఆనందం.. జగన్ రెడ్డి ఓదార్పు యాత్ర పేరుతో పాదయాత్ర చేస్తే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .. ఎక్కడ ఏ విధమైన అవంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తే.. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం యువనాయకులు నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తే అడుగు అడుగున ఆటంకాలు సృష్టించారు. మేము అధికారంలోకి వస్తే గతంలో కంటే మంచి పాలన సాగిమని చెప్పలే కానీ, బెదిరింపులు మాటలతో ప్రజలను భయభ్రాంతులను గురి చేయడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదు'' అని అన్నారు.

# తుంగభద్ర నదిలో కర్నాటక భక్తులు ముగ్గురు గల్లంతు

- ముమ్మరంగా గాలింపు చర్యలు



మంత్రాలయం, జూలై 12(మనం న్యూస్ ) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం తుంగభద్ర నది లో కర్నాటక యువ భక్తులు ముగ్గురు గల్లంతైన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, కర్నాటక రాష్ట్రం హాసన్ చెందిన రంగనాథ్ ,నారాయణ ,దర్శన్ , హేమంత్ , సచిన్ , ప్రమోద్ , అజిత్ ఏడు మంది స్నేహితులు కలిసి శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థం మంత్రాలయం వచ్చారు. అయితే నదిలో పుణ్య స్నానాలు చేసేందుకు నిండుగా ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలోకి వెళ్ళారు. నదిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు అజిత్ (19),సచిన్ (19),ప్రమోద్ (19),అనే యువకులు నదిలో పడి గల్లంతు అయ్యారు. విషయం తెలుసుకున్న శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, సీఐ రామాంజులు, ఎస్సై శివాంజల్ , గోనెగండ్ల సీఐ నందవరం ఎస్సై కేశవ్ , సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం గజ ఈతగాళ్ళతో నదిలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడ్డా యువకుల ఆచూకీ లభ్యం కాలేదు.

# కేబినెట్లో తీర్మానించిన విధంగా ప్రతినెల 700 కోట్లు నిధులు విడుదల చేయాలి

- టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ డిమాండ్

**కామారెడ్డి, జూలై 12 ( మనంప్రతినిధి) :** పెండింగ్ బిల్లుల చెల్లింపులకు కేబినెట్లో తీర్మానించిన విధంగా ప్రతినెల 700 కోట్లు నిధులు విడుదల చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కామారెడ్డిలో ఆయన మాట్లాడారు. పి ఎస్ యచ్ యం పోస్టులు ప్రాథమిక పాఠశాలలకు కేటాయించి బీఈడీ, టిటిసి అర్హతల గల ఇద్దరికీ పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చకినాలా అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. టి.పి.టి.ఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చింతల లింగం అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించడానికి ఉపాధ్యాయులనే నియమించడం మానుకొని, పర్యవేక్షణ పోస్టులు మంజూరు చేయాలన్నారు.




పర్యవేక్షణ అధికారుల నియామకం చేయాలని డిమాండ్ చేశారు. విద్యను విధ్వంసం చేసే విధానాలను మానుకొని, అందరికీ సమాన విద్యను ప్రభుత్వమే అందించాలని అన్నారు. రెండు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న అన్ని రకాల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లేకుండా ఉచితంగా వైద్య సేవలు అందించకుండా, ఉద్యోగుల నుండి అమౌంట్ సేకరించడం ఇదోరకమైన మోసం అని అన్నారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటులో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయులను మారుమూల గ్రామాల నుండి జిల్లా హెడ్ క్వార్టర్ కు బదిలీ చేయడం నిబంధనలకు విరుద్ధం కావున వాటిని వెంటనే విరమించుకోవాలి, ఉద్యోగులు పొదుపు చేసుకున్న జీపీఫ్, టీజి యల్ ఐ సి మొత్తాల నుండి ఇవ్వాళ లోనులు పార్టీ ఫైనల్స్ పొందలేని పరిస్థితులున్నాయని అన్నారు. వెంటనే ప్రభుత్వం పిఆర్సి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, వారిని తక్షణమే రి ఆర్గనైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాజంలో ఉపాధ్యాయులు సింహ భాగంగా పనిచేయాలి, అంతరాలు లేని సమాజం కోసం ఫెడరేషన్ కార్యకర్తలు విధులు నిర్వహించాలి. అందరికీ సమాన విద్యను అందించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తేనే అన్ని స్కూల్లు బాగుపడుతాయని అన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరిస్తే, ఉపాధ్యాయులు ఉద్యమాల్లో ఉంటారని అన్నారు. విద్యారంగా సమస్యలు పరిష్కరించాలంటే ఉద్యమం ఒక్కటే మార్గమని పిలుపునిచ్చారు. ఒక వర్గానికి అనుగుణంగా ఉండే విధంగా తయారుచేస్తున్న విద్యా ప్రణాళికలను నిలిపివేసి, అన్ని జాతుల అభివృద్ధి కోసమా ఉపయోగపడే విద్యను ప్రభుత్వాలు అందించాలని అన్నారు. ప్రయివేట్ స్కూల్లలో ఎలాంటి పర్యవేక్షణ చేయకుండా, ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులతో పర్యవేక్షణ చేయించడం సరైన విధానం కాదని అన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల లింగం , చింతల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ., ప్రభుత్వం వెంటనే 10 వేల ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేసి, యస్ జీ టీలకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండేండ్లులుగా పెండింగులో ఉన్న వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వహించిన వారికి సర్వే అమౌంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ కు ముందు నోటిఫికేషన్ల ద్వారా నియమించబడ్డ డియస్సి 2003 ఉపాధ్యాయులకు మెమో 57 ను అమలు చేసి ఓపిఎస్ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కేజీబీవి సిబ్బందికి చైల్ కేర్ లీవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నైట్ డ్యూటీ చేసిన సిబ్బందిని ఉదయం 7 గంటలకు రిలీవ్ చెయ్యాలని అన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, సమ్మెకలపు వేతనం వెంటనే విడుదల చెయ్యాలని అన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ శాస్త్రియంగా చేపట్టి, అవసరమున్న పాఠశాలలకు మాత్రమే ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులకు అనుకూలంగా ఉన్న టైమ్ టేబుల్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు చింతల లింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్ , జిల్లా కార్యదర్శులు ప్రకాష్, సోలేటి నారాయణ, కె.నరేందర్, కృష్ణ, కృష్ణమూర్తి, రాజశేఖర్ కృష్ణ, శ్రీధర్ రెడ్డి, మద్నూర్ మండల అధ్యక్షులు బి. బాబయ్యా, మాచారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ లు పాల్గొన్నారు.

# బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం అమలు హర్షణీయం

- కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం
- కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగరాజ్ గౌడ్

**కామారెడ్డి, జూలై 12 ( మనంప్రతినిధి ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేబినేట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలుపై కాంగ్రెస్ పార్టీ నిర్ణయం సాహసోపేతమైనదని జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికల వైపు అడుగుపెట్టడం ఒక విప్లవాత్మక నిర్ణయమని ఆయన అన్నారు. కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన మేరకు బీసీ డిక్లరేషన్ కట్టుబడి కులగణన చేసిందని, గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల



అమలుకు అవసరమైన ఆర్డినెన్స్ తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం యావత్ బీసీలు స్వాగతించే అంశమన్నారు. 2018 చట్టాన్ని సవరించి బీసీలకు న్యాయం చేసే దిశగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేసిన ప్రకటనను ఆయన సామాజిక విప్లవానికి నాందిగా కొనియాడారు. బీసీ వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఇదే నిదర్శనమన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో చేసిన జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి అన్న డిమాండ్ను దేశంలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే ప్రజా పాలనలో అమలు చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. తెలంగాణ సమాజం, ముఖ్యంగా బీసీ సామాజిక వర్గం, సామజిక న్యాయం కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని అమలు పరచేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గానికి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీకి, టిపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేసినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుంది

- జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్

**నిజామాబాద్, జూలై 12 ( మనం బ్యూరో) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేసినప్పుడే న్యాయం జరుగుతుందని జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ తెలిపారు. రోడ్లు




భవనాల శాఖ గెస్ట్ హౌస్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., 40ఏళ్ల నుంచి బీసీ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. మేమెంతో మాకు అంతే అనే నినాదంతో పోరాటం చేశారన్నారు. దీని ఫలితమే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఐకమత్యంతో బీసీలను గెలిపించుకున్నప్పుడే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు విఠల్, గణేష్ యాదవ్, అఖిల్, రమేష్, జనార్దన్, శేఖర్, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై దారి దోపిడీ



- 10 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు చోరీ

**నిజామాబాద్, జూలై 12 ( మనం బ్యూరో) :** జాతీయ రహదారి ( 44 ) పై శుక్రవారం రాత్రి దారి దోపిడీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే., నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి జాతీయ రహదారిపై మొబైల్స్ లోడ్ తో వెళ్తున్న ఓ ట్రక్కు లో నుంచి మొబైల్స్ బాక్సులను ఎత్తుకెళ్లారు. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం మొబైల్స్ లోడుతో వెళ్తున్న ట్రక్కును డ్రైవరు శుక్రవారం రాత్రి రహదారిపై ఓ దాబా వద్ద నిలిపారు. తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు ట్రక్కు తలుపులు తెరిచి రెండు మొబైల్ బాక్సులను ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారుగా రూ.10 లక్షల వరకు ఉంటుందని ట్రక్ డ్రైవర్ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనాస్థలికి చేరుకుని ఆధారాల కోసం అన్వేషించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

**జాతీయం- అంతర్జాతీయం**

## విమాన ప్రమాదంపై తుది నిర్ణయానికి రావొద్దు

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**ముంబయి, జూలై 12 :** అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఇచ్చిన ప్రాథమిక నివేదికపై పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పందించారు. విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దని, తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలని సూచించారు.



''ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు, సిబ్బంది మన దగ్గర ఉన్నారు. వారు పౌర విమానయానానికి వెన్నెముక వంటివారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తుంది. ఇలాంటి సమయంలో ఎలాంటి నిర్ధరణకు రాకుండా తుది నివేదిక కోసం వేచిచూద్దాం. ఈ కేసులో ఎన్నో టెక్నికల్ అంశాలు ఇమిడి ఉన్నాయి. అందుకే ఈ నివేదికపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు అవుతుంది'' అని విశాఖపట్నంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. కాగా.. ఏఏఐబీ 15 పేజీలతో తాజాగా ప్రాథమిక నివేదికను సమర్పించింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ తెలిపింది. తర్వాత పైలట్లు మేడే కాల్ ఇచ్చారని వెల్లడించింది. ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు నివేదికలో తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం కేవలం 32 సెకన్ల పాటు గాల్లో ఉన్నట్లు వెల్లడించింది. రన్‌వేకు కేవలం 0.9 నాటికల్ మైళ్ల దూరంలోని ఓ హాస్టల్ భవంతిపై విమానం కూలిపోయిందని నివేదిక వివరించింది. జూన్ 12న ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో ఫ్లైట్‌లో ఉన్న 240 మంది ప్యాసింజర్లతో పాటు ఇతరులు ప్రాణాలు కోల్పోయారు.

# తొక్కిసలాట ఘటనలో..

- కర్ణాటక క్రికెట్ అసోసియేషన్, ఆర్‌సీబీ తదితరులదే బాధ్యత!

**బెంగళూర్, జూలై 12 :** ఆర్సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర విమర్శలకు దారితీసిన సంగతి తెలిసిందే. కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ , బెంగళూరు పోలీసులదే బాధ్యత అని జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చిన నివేదిక పేర్కొంది. దానిని ఇప్పటికే సీఎం సిద్ధరామయ్యకు సమర్పించారు. విశ్రాంత న్యాయమూర్తి జాన్ మైఖెల్ డికున్‌హా నేతృత్వంలోని కమిషన్ పలు లోపాలను గుర్తించింది. ఈవెంట్‌ను నిర్వహించడం కష్టమని వారికి ముందే తెలుసని వెల్లడించింది. విధి నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం కనిపించిందని తెలిపింది. గత నెల చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడిన ఘటన విషాదం రేపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. విచారణలో భాగంగా ఘటనతో సంబంధం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. పలువురు ప్రత్యక్ష సాక్షులు, క్రికెట్ సంఘం అధికారులు, పోలీస్ అధికారుల వాంగ్మూలాలు రికార్డు చేసింది. ఆ ఆర్సీబీ విజయోత్సవ ఈవెంట్‌లో భాగంగా తీవ్ర భద్రతా వైఫల్యం కనిపించిందని గుర్తించింది. స్టేడియం లోపల



కేవలం 79 మంది పోలీసులను మాత్రమే మోహరించారని, ఇక బయట ఎవరూ లేరని పేర్కొంది. ఘటనా స్థలం వద్ద అంబులెన్స్‌లు కూడా లేవని చెప్పింది. అలాగే పోలీసు యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా ఉందని నివేదికలో కమిషన్ వెల్లడించింది. ఘటన జరిగిన తర్వాత జాయింట్ కమిషనర్ సాయంత్రం నాలుగు గంటలకు వచ్చారని, 5.30గంటల తర్వాతే పోలీస్ కమిషనర్‌కు ఈ విషయంపై సమాచారం ఇచ్చారంది. ప్రస్తుతం సిద్ధరామయ్య వద్దకు చేరిన ఈ నివేదికను జులై 17న రాష్ట్ర క్యాబినెట్ ముందుకు తీసుకువచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా.. ఇప్పటికే ఆర్సీబీ, కర్ణాటక క్రికెట్ బోర్డు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థపై పలు ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. కర్ణాటక హైకోర్టు కూడా ఈ కేసును విచారిస్తోంది.

## చంపేస్తామంటూ కేంద్ర మంత్రికి బెదిరింపులు..!

- 'టైగర్ మెరాజ్ ఇడిసి'ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు

**పాట్నా, జూలై 12 :** లోక్ జనశక్తి (రామ్ విలాస్) అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు హత్యా బెదిరింపులు వచ్చాయి. ఆయన్ని చంపేస్తానంటూ ఓ దుండగుడు సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టడం కలకలం సృష్టిస్తుంది. పార్టీ ప్రతినిధి రాజేశ్ భట్ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. చిరాగ్‌పాశ్వాన్‌ను హతమారుస్తామంటూ 'టైగర్ మెరాజ్ ఇడిసి' అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టారని రాజేశ్ తెలిపారు. పాశ్వాన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ కారణంగానే ఈ బెదిరింపులు వచ్చాయన్నారు. దీనిపై పట్నాలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. బెదిరింపు వెనక తీవ్రతను దృష్టిలోపెట్టుకొని పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో



అభ్యర్థించినట్లు తెలిపారు. ఈసందర్భంగా దుండగుడిని వెంటనే పట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా.. ఈ ఏడాది చివర్లో బిహార్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని ఇటీవల పాశ్వాన్ ప్రకటించారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టడానికి కారణమైన బిహార్ ప్రజల కోసం పోటీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివద్ధి కోసం తోడ్పుతానన్నారు. ఈ క్రమంలోనే హత్యా బెదిరింపులు రావడం గమనార్హం.

## అట్టహాసంగా ఆల్ ఇండియా చెస్ పోటీలు ప్రారంభం

**కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 12 (మనం న్యూస్) :** కరీంనగర్ వేదికగా జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో డెమొక్రటిక్ చెస్ ఫెడరేషన్ సహకారంతో కరీంనగర్ లోని వీ కన్వెన్షన్ లో శనివారం 3వ ఆల్ ఇండియా జూనియర్, ఓపెన్ చెస్ చాంపియన్షిప్ 2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 600 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. హాజరైన క్రీడాకారులకు స్విస్ లీగ్ పద్ధతిలో 8 రౌండ్ల వరకు పోటీలను నిర్వాహకులు ఏర్పాటు చేయగా తొలి రోజున నాలుగు రౌండ్ల వరకు పోటీలను నిర్వహించారు. అంతకుముందు ఈ పోటీలను మెదస్సుకు పదను పెడుతుందన్నారు. చెస్ లో రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారు అన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులందరూ విశ్వనాథన్ ఆనంద్, గుకేష్, ప్రజ్ఞానంద్, అర్జున్ ఎరగేసి, కోనేరు హంపి లాంటి మహోన్నత వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని సూచించారు. పోటీల నిర్వాహకులు జీనియస్ అకాడమీ డైరెక్టర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో కరీంనగర్ లో మూడవసారి ఆల్ ఇండియా స్థాయిలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చెస్ క్రీడకు క్రేజీ తెచ్చేందుకే ప్రతి సంవత్సరం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా






జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి బి శ్రీనివాస్ గౌడ్, ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంగం లక్ష్మణ్ , తెలంగాణ ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి లు హాజరై జ్యోతి ప్రద్యులను చేసి తొలి ఎత్తును వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ అంటేనే క్రీడా పోటీల నిర్వహణకు, క్రీడాకారులకు నిలయం అని అన్నారు. జాతీయస్థాయి చెస్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉందని పోటీలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా వారు అభినందించారు.చదరంగం క్రీడ విద్యార్థుల నిలిచిన క్రీడాకారులకు సుమారు లక్ష రూపాయల పైగా నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, కోఆర్డినేటర్ సృజన్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ బొల్లం సంపత్, ఉష టేబుల్ టెన్నిస్ క్రీడా సంఘాల కార్యదర్శులు భార విద్యాసాగర్, దారం గౌతమ్ రెడ్డి, జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ లతోపాటు నూనె సాయి కృష్ణ, తాటిపల్లి సతీష్ బాబు, క్రీడాకారులు, తల్లిదండ్రులు , పీ ఈ టీ లు తదితరులు పాల్గొన్నారు.

# 'నన్ను ఉరితీయండి'..

- టెన్నిస్ ప్లేయర్ తండ్రి పశ్చాత్తాపం!

**గురుగ్రామ్ ,జూలై 12 :** హరియాణాకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ (25)ను తండ్రి దీపక్ యాదవ్ (49) హత్య చేసిన కేసులో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఆవేశంలో కుమార్తెను చంపిన దీపక్ ఇప్పుడు కుమిలిపోతున్నారని అతడి కుటుంబం వెల్లడించింది. దీనిపై దీపక్ సోదరుడు విజయ్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. 'ఇది పెద్ద తప్పిదం. నేను దీపక్ వెంట పోలీసు స్టేషన్‌లో ఉన్నప్పుడు అతడు ఎంతో పశ్చాత్తాపంతో ఉన్నాడు. 'నన్ను ఉరితీసే విధంగా ఎఫ్ఐఆర్ రాయండి' అని పోలీసులకు చెప్పాడు. నేను ఆడపిల్లను చంపేశానంటూ రోదించాడు' అని విజయ్ వెల్లడించారు. ప్రస్తుతం దీపక్‌ను





రెండువారాల జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించారు. రాధికా హత్యకేసులో ఎన్నో కోణాలు వెలుగు చూస్తున్నాయి. తన సంపాదనపై ఆధారపడి బతుకుతున్నారంటూ కుమార్తె అవహేళన చేయడంతోనే తండ్రి ఈ హత్యకు పాల్పడ్డారని మొదట వార్తలు వచ్చాయి. అయితే, ఆ కుటుంబంతో పరిచయం ఉన్నవారు మాత్రం ఆ కథనాల్లో వాస్తవం లేదని చెబుతున్నారు. రాధిక గతేడాది ఓ కళాకారుడితో కలిసి మ్యూజిక్ రీల్స్ చేసింది. ఈ ఉదంతం వారి కుటుంబంలో చిచ్చు రేపినట్లుగా తెలుస్తోంది. అలాగే రాధిక టెన్నిస్ అకాడమీని నిర్వహించడం కూడా తండ్రికి ఇష్టం లేకపోవడమే వారిద్దరి మధ్య ఘర్షణకు కారణమని వినవస్తోంది. అలాగే టెన్నిస్ అకాడమీని మూసివేయాలని దీపక్ అనేకసార్లు కోరినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, అందుకు ఆమె నిరాకరించిందని, రూ.2 కోట్లు ఖర్చు చేసి నేర్చుకున్న కెరీర్‌ను వదులుకోమని చెప్పడం సమంజసం కాదని వాదించిందని పేర్కొన్నాయి.

# 600 డ్రోన్లతో.. ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలను ధ్వంసం

- రష్యా రక్షణశాఖ వెల్లడి

**మాస్కో, జూలై 12 :** ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కీవ్‌లోని ఆయుధ పరిశ్రమలపై మాస్కో 600 డ్రోన్లు, క్షిపణులతో వైమానిక దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్‌కు చెందిన ఆర్మీ రిక్రూట్మెంట్ కేంద్రాలు, సైనిక వైమానిక స్థావరాలపైనా దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా.. నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాలు దెబ్బతిన్నాయి.

రష్యా ప్రయోగించిన 319 డ్రోన్లు, 25 క్రూజ్ క్షిపణులను నేలకూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. కీవ్ చేపట్టిన ఎదురు దాడుల్లో మాస్కోలోని పలు భవనాలు ధ్వంసమయ్యాయి. తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా వాడుతున్న 40 శాతం బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించిన కొన్ని గంటల్లోనే పుతిన్ సేనలు ఈ దాడులకు పాల్పడడం గమనార్హం. పుతిన్ సేనలు కొనసాగిస్తున్న యుద్ధానికి గట్టిగా బదులు చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ శుక్రవారం పేర్కొన్నారు. యుద్ధం విషయంలో త్వరగా ఓ నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని ఆయుధాల సరఫరాను తిరిగి ప్రారంభించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఇందులో 155 ఎంఎం మందుగుండు సామాగ్రితో పాటు జీఎంఎల్ఆర్ఎస్‌గా పిలిచే ప్రెసిషన్ గైడెడ్ రాకెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**జూపాడుబంగ్లా, జులై 12 (మనం న్యూస్)**: రాష్ట్రంలో సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే సాధ్యమని ఎమ్మెల్యే గిత్త జయసూర్య, పేర్కొన్నారు. జూపాడు బంగ్లా మండలంలోని భాస్కరపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా ప్రజలకు కావలసినవి ఉంటే అర్జీ రూపకంగా రాసి ఇస్తే వాటిని ఉన్నదా అధికారులతో చర్చించి ఆ సమస్యలు తీర్చే విధంగా కృషి చేస్తానని ఆయన తెలియజేశారు, ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 15000 రూపాయలు మరియు 3000, వేల రూపాయలు ఉన్న పెన్షన్ 4000, వేలకు పెంచి ఇచ్చిన ఘనత టిడిపి ప్రభుత్వానిదేనని, రానున్న కాలంలో ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకి అన్నదాత సుఖీభవ అమలు చేయబోయే సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ,సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని. పేదరికం లేని ఇల్లు చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీ కోసం రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, పై ప్రతి ఒక్కరి ఆశీస్సులు ఉండాలని ఆయన కోరడం జరిగినది ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హుస్సేనయ్య, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ గిరీశ్వర్ రెడ్డి, పగిడాల మండల కన్వీనర్ పలుచని మహేశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, తంగడంచ మాజీ సర్పంచ్ పిక్కిలి శ్రీనివాసులు, రవికాంత్, టిడిపి మహిళా నాయకురాలు ప్రసన్న లక్ష్మి, స్వామన్న, సంజన, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



- జరిమానాలపై వివరాలు అందించిన ట్రాఫిక్ పోలీసులు

**ఆదోని, జూలై 12(మనం న్యూస్)**: కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఆదోని డీఎస్పీ హేమలత గారి పర్యవేక్షణలో రోడ్డు భద్రత - ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం శ్రీనివాస భవన్ వద్ద రైతు బజార్ ఎదురుగా ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గంట సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనదారులకు, రోడ్లపై సురక్షితంగా ప్రయాణించడానికి పాటించవలసిన నియమావళి, నిబంధనలపై వివరించారు. ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్, ద్విచక్ర వాహనదారులైతే హెల్మెట్, కారు వంటి వాహనదారులైతే సీటు బెల్టు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. మరియు, ఇటీవల మోటార్ వెహికల్ యాక్ట్లో సవరణల తరువాత పెంచిన జరిమానాల వివరాలను కూడా ప్రజలకు తెలియజేశారు. రూల్స్ పాటించకపోవడం వల్ల వచ్చే ప్రమాదాలు, జరిమానాల తీవ్రతను ఈ సందర్భంగా ప్రజలకు వివరిస్తూ, రోడ్డుప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని సీఐ గంట సుబ్బారావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ లక్ష్మన్న, రామాంజనేయులు మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యుత్ సమయాల్లో మార్పు



- విద్యుత్ ఏఈ గోవిందు

**మంత్రాలయం, జూలై 12 (మనం న్యూస్)**: ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు మంత్రాలయం మండలంలో రైతులకు ఇస్తున్న 9 గంటల విద్యుత్ పగటి వేళ సమయాల్లో మార్పులు చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ గోవిందు తెలిపారు. శనివారం ఆయన మంత్రాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 220 కేవీ ఏపీ క్యాడ్ నుంచి 132 కేవీ విద్యుత్ ఫీడర్లో మరమ్మతుల దృష్ట్యా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలో మార్పులు చేస్తున్నామనీ, ఈ విషయాన్ని మండల రైతులు గమనించి సహకరించాలని తెలిపారు. మంత్రాలయం మండల ప్రజలు గమనించి సహకరించాలని ఏఈ గోవిందు తెలిపారు.

## కూటమితోనే సంక్షేమం అభివృద్ధి

### ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ మసాలా శ్రీను



**తుగ్గలి జులై 12(మనం న్యూస్ )**: కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం,అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ మసాలా శీను అన్నారు.శనివారం పత్తికొండ ఎమ్మెల్యే కే.యి శ్యామ్ కుమార్ మరియు టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు ఆదేశాలు మేరకు తుగ్గలి మండల పరిధిలోని పెండెకల్ గ్రామంలో మాజీ సర్పంచ్ మసాలా శీను నేతృత్వంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు కలిసి 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించి, ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కరపత్రాల ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకొని మొబైల్ యాప్ లో నమోదు చేశారు.ఈ సందర్భంగా మసాలా శ్రీను మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు,యువనేత లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.తల్లికి వందనం, దీపం పథకం,అన్నా క్యాంటీన్లు పునరుద్ధరణ,ఎన్టీఆర్ పెన్షన్లు పెంపు కీలక కార్యక్రమాలను విజయవంతంగా చేసిందని, త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, మహిళలకు రూ.1500,నిరుద్యోగ భృతి అందిస్తామని వారు పేర్కొన్నారు. స్థానిక టిడిపి నాయకులు మైనార్టీ నాయకులు కాశీం వలి,ఫీల్ అసిస్టెంట్ నాగరాజు, బోయ ప్రసాద్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో జడ్జి పూజలు




**మహానంది, జులై 12(మనంన్యూస్)**: మహానందీశ్వర స్వామివారి సన్నిధిలో ఆళ్లగడ్డ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ భాస్కర్ దంపతులు పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారి దర్శనార్థమై వచ్చిన వారికి ఆలయ ముఖమండపం వద్ద టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితీ ప్రకారం వేదపండితులు రవిశంకర్ అవధాని వేదమంత్రోచ్ఛారణ మధ్య కండువా కప్పి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. వారివెంట కానిస్టేబుల్ శేషన్నలు ఉన్నారు.

## ఫారెస్ట్ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు



**మహానంది, జులై12,మనంన్యూస్**: ఫారెస్ట్ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ రేయింజ్ అధికారి హైమావతి తెలిపారు. మహానంది గ్రామంలోని పార్వతి పురం కాలనివద్ద వున్న ఫారెస్ట్ స్థలంలో స్థానికులు వ్యాపార కేంద్రాలను నిర్వహించుకుంటున్నారు. అయితే అక్కడ శాశ్వత కట్టడాలు ఏర్పాటు చేసుకుంటుండటంతో గత కొద్దిరోజుల క్రితం హెచ్చరికలు జారీచేశారు. శనివారం ఫారెస్ట్ సిబ్బందితో అక్కడికి చేరుకుని కొంతవరకు కట్టడాలను తొలగించారు. వ్యాపారులు గడువు కోరడంతో సమయం ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ కుమార్, నాగేంద్రయ్య, శ్రీనివాసులు, రానా ప్రతాప్, శంకరి బాయి, ప్రొటక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

## కొల్హాపూర్ మహాలక్ష్మిని దర్శించుకున్న పీఠాధిపతులు



- మృత్తిక బృందావనం పునః ప్రతిష్టాపన

**మంత్రాలయం, జూలై 12(మనం న్యూస్)** : మహారాష్ట్రలోని కొల్హాపూర్ లో శ్రీ మహాలక్ష్మి దేవి అమ్మవారిని మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శనివారం దర్శించుకున్నారు.
అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మృత్తిక బృందావనాన్ని పునః ప్రతిష్టాపన కార్యక్రమాన్ని చేశారు.
కొల్హాపూర్ శ్రీ మఠంలో ముందుగా సీతారామ, లక్ష్మన విగ్రహాలను ప్రతిష్టాపన చేశారు.అశేష భక్తుల నడుమ శ్రీ రాఘవేంద్ర స్వామి మృత్తిక బృందావనాన్నికి సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తప్తముద్ర ధారణ చేసి ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

## ఆటో కార్మికుడు కుటుంబాన్ని పరామర్శించిన సి.ఐ.టి.యు నాయకులు

### సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సహాయం



**పత్తికొండ జులై 12(మనం న్యూస్ )**: పత్తికొండ పట్టణంలోని హోసూరు గ్రామంలో ఆటో నడుపుతూ జీవన ఉపాధి కొనసాగిస్తున్న ఎరుకల రాముడు,అకస్మాత్తుగా మరణించడంతో ఆయన కుటుంబాన్ని శనివారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చక్రాళ్ళ వెంకటేశ్వర్ రెడ్డి,సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిఐటియు మండల కార్యదర్శి డి. గోపాల్,సిఐటియు నాయకులు ఎం రవిచంద్ర, ఆధ్వర్యంలో పత్తికొండ సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు పరామర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాముడు మరణించడం వారి కుటుంబానికి తీరని లోటని దాన్ని ఎవరు పూడ్చలేని లోటుగానే వారి కుటుంబానికి మిగులుతుందని కానీ సిఐటియు ఆధ్వర్యంలో వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా నిలబడతామని వారి పిల్లల చదువుల కోసం సిఐటియు ఎప్పుడు అండగా ఉంటుందని రాముడు కుటుంబం సిఐటియు యూనియన్ లో ఒక భాగమని ఎప్పుడు వారిని సిఐటియు కుటుంబంగానే గుర్తుంచుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం మరణించిన వై రాముడు సతీమణి వై మంగమ్మకు సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు పదివేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోండి




- రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్

**కర్నూలు జులై 12 (మనం న్యూస్)**: హజ్ యాత్ర-2026కు వెళ్లాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తిగల వారి పాస్పోర్ట్ 2026 డిసెంబర్ 31వరకు చెల్లుబాటు అవ్వాల్సి ఉంటుందన్నారు. యాత్రికులందరూ విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంను తమ మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికునికి కూటమి ప్రభుత్వం రూ.1లక్ష ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఆసక్తిగల యాత్రికులు రాష్ట్రానికి కేటాయించిన పూర్తి కోటాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నాయి బ్రాహ్మణ స్టేట్ డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్‌ని కలిసిన కౌతాళం నాయి

**కౌతాళం, జులై 12 మనం న్యూస్**: శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లా నాయి బ్రాహ్మణ స్టేట్ డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ ని కౌతాళం మండలం నాయి బ్రాహ్మణ సోదరులు శాలువా, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం నాయి బ్రాహ్మణ సోదరులు ఆర్థిక రుణ సదుపాయాలు మరియు దేవస్థానాలలో, రాజకీయాలలో సమాన హక్కులు కావాలని కోరగా, డైరెక్టర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించిందని దేవస్థానాలలో పాలకమండల సభ్యులుగా అవకాశం కల్పించిందని మరియు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను త్వరలో ఆదరణ పథకం 3 ద్వారా పనిముట్ల సబ్సిడీ అవకాశం కల్పిస్తాదని పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న హాస్పటల్లో ఖాళీగా ఉన్న నాయి బ్రాహ్మణ పోస్టులను మన కూటమి ప్రభుత్వం త్వరలో భర్తీ చేస్తుందని అంతే కాకుండా దేవస్థానం సంబంధించిన సమస్యలు, మన నాయి బ్రాహ్మణులకు సంబంధించిన సమస్యలన్నీ పరిష్కరిస్తానని మాట్లాడడం జరిగింది, ఈ కార్యక్రమంలో కౌతాళం మండలం నాయి బ్రాహ్మణ అధ్యక్షులు శివరాజు, మరియు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.




## నేడు ఎర్రగుడి గ్రామానికి ఎమ్మెల్యే రాక



- సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమానికి హాజరుకానున్న ఎమ్మెల్యే

**తుగ్గలి, జులై 12(మనం న్యూస్ )**: తుగ్గలి మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో (13-07-2025) ఆదివారం సాయంత్రం 4:00గంటలకు నిర్వహించే 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే కే.యి శ్యామ్ కుమార్ హాజరుకానున్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.మండలంలో ఉన్న టీడీపీ కూటమి నాయకులు,ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## నేడు సీపీఐ జూపాడు బంగ్లా మండల మహాసభ జయప్రదం చేయండి




**జూపాడు బంగ్లా, జులై 12 (మనం న్యూస్)**: నిరంతరం మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై పాలక పార్టీలను అధికారులను నిలదీస్తూ మండలంలో అనేక సమస్యల పరిష్కార వేదికగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల మహాసభ జులై 13న వైయస్సార్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నామని ఈ మహాసభలు జయప్రదానికి కృషి చేయాలని ఆ సభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు, రఘురాం మూర్తి లు హాజరవుతున్నారని సిపిఐ జిల్లా నాయకులు ఎం. రమేష్ బాబు అన్నారు..శనివారం మహాసభ కరపత్రాలు సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో విడుదల చేశారు.

## పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలు వేలం



- జూలై 16న పోలీస్ స్టేషన్ వద్ద నిర్వాహణ ఒకటవ పట్టణ సీఐ శ్రీరామ్

**ఆదోని, జూలై 12 (మనం న్యూస్)**: ఆదోని 1 టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను జూలై 16వ తేదీన వేలం వేయనున్నారు. వివరాల్లోకి వెళితే, 2023 డిసెంబర్ 12న సీఆర్.నెం.213/2023 యూ/ఎస్ 102 సీఆర్.పీ.సీ కింద కేసు నమోదు చేసి, అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సదరు వాహన యజమానులు పత్రికా ప్రకటన ద్వారా పిలుపునిచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో, అన్ని వాహనాలను జూలై 16వ తేదీ ఉదయం 11:00 గంటలకు ఆదోని-2 టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న పోలీస్ క్వార్టర్స్ వద్ద వేలం వేయనున్నారు. వాహనాలను కొనుగోలు చేయదలచిన వ్యక్తులు తమ ఆధార్ కార్డు నకలు తోడుగా తీసుకురావలసిందిగా ఆదోని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

## ఆర్టీవో కార్యాలయంలో ఎఫ్ సి,ఫిట్నెస్ కొనసాగించాలి

- ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్




**పత్తికొండ జులై 12(మనం న్యూస్)**: జిల్లాలో ఉన్న ఆర్టీవో కార్యాలయాల్లోనే ఎఫ్ సి, ఫిట్నెస్ లైసెన్స్ ప్రాసెసింగ్ కొనసాగించాలని శనివారం పత్తికొండ ఆటో వర్కర్స్ యూనియన్ మండల మహాసభ లో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ ఉద్ఘాటించారు. శనివారం పత్తికొండ పట్టణంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్ దగ్గరలో ఉన్న సిఐటియు కార్యాలయం ఆవరణలో సిఐటియు మండల మహాసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, మండల కార్యదర్శి డి. గోపాల్, ఎం. రవిచంద్ర, పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రవాణా రంగం కార్మికులకు ఆటో లారీ సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఆర్టిఏ కార్యాలయంలోనే జరగాలని వారు డిమాండ్ చేశారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ అయినందున ఆర్టిఏ కార్యాలయాన్ని పత్తికొండలోనే ఏర్పాటు చేసి వాహనాల యజమానులకు డ్రైవర్లకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని పత్తికొండ డివిజనై దాదాపుగా మూడు నుండి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా సంబంధిత కార్యాలయాలు మాత్రం పత్తికొండలో ఎందుకు నిర్మించుకోలేకపోతున్నారని వారు ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహ(జయసింహ) చుక్కప్ప,ఆనంద్,సిఐటియు ఆదోని రోడ్డు ఆటో వర్కర్స్ హెచ్.వెంకటేష్,శివ నాయక్, కే వెంకటరమణ,బి ఆచారి, తదితరులు పాల్గొన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికున్నారు. అధ్యక్షులుగా మోహన్, కార్యదర్శిగా శేఖర్, ఉపాధ్యక్షులుగా ఎన్టీఆర్, సహాయ కార్యదర్శిగా వలి, కోశాధికారిగా షబ్బీర్, కార్యవర్గ సభ్యులుగా,కాళీ, జాకీర్, గోపాల్,చిన్న గూటం, నాయక్,తిక్క అంజి, లను ఎన్నుకున్నారు.

# చరిత్ర సృష్టించిన రిషబ్ పంత్.. ప్రపంచంలోనే తొలి ప్లేయర్‌గా

ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ దుమ్ములేపుతున్నాడు. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్ తో జరుగుతున్న మూడో టెస్టులో పంత్ అద్భుతమైన నాక్ ఆడాడు. ఓవైపు చేతి వేలి గాయంతో పోరాడుతూనే కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్ లో 112 బంతులు ఎదుర్కొని 8 ఫోర్లు, 2 సిక్స్ ల సాయంతో 74 పరుగులు చేశాడు. ఈ క్రమంలో పంత్ పలు అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు.



**పంత్ సాధించిన రికార్డులు ఇవే..**

టెస్టు క్రికెట్ లో ఇంగ్లండ్ పై అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా రిషబ్ పంత్ వరల్ రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఇంగ్లండ్ పై 15 టెస్టులు ఆడిన పంత్.. 36 సిక్సర్లు బాదాడు. ఇంతకుముందు ఈ రికార్డు వెస్టిండీస్ దిగ్గజ బ్యాటర్ వివ్ రిచరడ్స్ పేరిట ఉండేది. రిచరడ్స్ తన17 ఏళ్ల టెస్ట్ కెరీర్ లో ఇంగ్లండ్ పై 36 టెస్టులు ఆడి 34 సిక్సర్లు కొట్టాడు. తాజా మ్యాచ్ లో రెండు సిక్సర్లు బాదిన పంత్.. విండీస్ గ్రేట్ ను ఆధిగమించాడు. అదేవిధంగా ఇంగ్లండ్ గడ్డపై టెస్టుల్లో అత్యధిక యాభైకి పైగా స్కోర్లు పర్యాటక వికెట్ కీపర్ గా ఎంఎస్ ధోని రికార్డును పంత్ సమం చేశాడు. ఇంగ్లండ్ లో ధోని 8 సార్లు ఏభైకి పైగా ఫిఫ్టీ ప్లస్ స్కోర్లు చేయగా.. పంత్ కూడా సరిగ్గా ఎనిమిది సార్లు యాభైకి పైగా స్కోర్లు సాధించాడు. మరో ఫిఫ్టీ ప్లస్ స్కోర్ సాధిస్తే ధోనిని ఆధిగమిస్తాడు.

**ఇంగ్లండ్ పై టెస్టుల్లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్లు వీరే**

35 రిషబ్ పంత్
34 వివ్ రిచరడ్స్
30 టిమ్ సౌతీ
27 యశస్వి జైస్వాల్
26 శుభమన్ గిల్



## అయ్యో రాహుల్.. సెంచరీ చేయగానే ఇలా అయిందేంటి?

ఇంగ్లండ్ తో మూడో టెస్టులో టీమిండియా స్టార్ కేఎల్ రాహుల్ శతకంతో మెరిశాడు. లార్డ్స్ లో నిలకడైన ప్రదర్శనతో 176 బంతుల్లో వంద పరుగుల మార్కు అందుకున్నాడు. అతడి ఇన్నింగ్స్ లో 13 ఫోర్లు ఉన్నాయి. కాగా రాహుల్ కు ఇది టెస్టుల్లో పదో సెంచరీ కాగా.. ఇంగ్లండ్ లో ఓవరాల్ గా నాలుగోది. అదే విధంగా.. లార్డ్స్ లో ఇది రెండోది కావడం విశేషం. తద్వారా దిలీప్ వెంగ్ సర్కార్ తర్వాత లార్డ్స్ మైదానంలో రెండు శతకాలు సాధించిన రెండో భారత క్రికెటర్ గా రాహుల్ చరిత్ర సృష్టించాడు. అయితే, దురదృష్టవశాత్తూ సెంచరీ పూర్తైన వెంటనే రాహుల్ అవుటయ్యాడు. ఇంగ్లండ్ యువ బౌలర్ షోయబ్ బషీర్ స్పిన్ మాయాజాలంలో చిక్కుకున్న రాహుల్.. హ్యారీ బ్రూక్ కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు.దీంతో నిరాశగా రాహుల్ క్రీజును వీడాడు.

**లార్డ్స్ మైదానంలో టెస్టుల్లో సెంచరీ చేసిన భారత క్రికెటర్లు వీరే**

దిలీప్ వెంగ్ సర్కార్- 3
కేఎల్ రాహుల్-2
వినూ మన్కడ్- 1
గుండప్ప విశ్వనాథ్- 1
రవిశాస్త్రి- 1
మహ్మద్ అజారుద్దీన్- 1
సౌరవ్ గంగూలీ- 1
అజిత్ అగార్కర్-1
రాహుల్ ద్రవిడ్-1
అజింక్య రహానే-1.

# లార్డ్స్‌లో బుమ్రా అద్భుతం..

లార్డ్స్‌లో జస్ ప్రీత్ బుమ్రా అదరగొట్టాడు. ఐదు వికెట్లు తీసి తన పేరును 'ఆనర్స్ బోర్డు'పై లిఖించుకున్నాడు. నిలకడైన బౌలింగ్ తో ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టిన బుమ్రాపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఐదు వికెట్లు తీసిన తర్వాత లాంగ్ రూమ్ లోకి వచ్చిన బుమ్రాకు ఘన స్వాగతం లభించింది. ఈసందర్భంగా రిషభ్ పంత్ తోపాటు పలువురు అభిమానులు బుమ్రా ప్రదర్శనపై స్పందించారు. ఈ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది.





# 'ఓజీ': మైండ్ బ్లాకింగ్ బిజినెస్.. పవర్ స్టార్ అసలు స్టామినా!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఆదరణ కానీ మార్కెట్ కోసం కానీ ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తన రీజనల్, రీమేక్ సినిమాలే రికార్డు బ్రేకింగ్ ఓపెనింగ్స్ ని అందుకుంటాయి. ఇక అలాంటిది తన నుంచి స్ట్రైట్ సినిమాలు పాన్ ఇండియా సినిమాలు అంతకు మించి తన మనసుకు దగ్గరైన సినిమాలు వస్తే వాటి ఇంపాక్ట్ ఎలా ఉంటుందో ఇపుడు ఓజి చూపిస్తుంది.

యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు సుజీత్ తో చేస్తున్న ఈ భారీ సినిమా బిజినెస్ లెక్కలు మైండ్ బ్లాకింగ్ గా వినిపిస్తున్నాయి. ఆల్రెడీ తెలుగు రాష్ట్రాలలో ఊహించని నంబర్స్ తో వ్యాపారం జరుగుతుండగా ప్రపంచ వ్యాప్తంగా బిజినెస్ ఏకంగా 300 కోట్లకి పైగా జరుగుతుంది అన్నట్టుగా టాక్.

ప్రత్యేకంగా డిస్ట్రిబ్యూటర్స్ చాలా ఆసక్తి కనబరుస్తున్నారట. ఇలా మొత్తానికి పవర్ స్టార్ కి సరైన సినిమా పడితే దాని రిజల్ట్ ఎలా ఉంటుందో ఇప్పుడు తెలుస్తుంది. ఇక ఈ హైప్ లో ఓపెనింగ్స్ కూడా ఊహించని లెవెల్లోనే ఉంటాయని ట్రేడ్ సర్కిల్స్ ఆల్రెడీ చర్చ నడుస్తుంది.

# అనుపమ్ ఖేర్ కొత్త చిత్రం 'తన్వి ది గ్రేట్'.. వీక్షించిన రాష్ట్రపతి

అనుపమ్ ఖేర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తన్వి ది గ్రేట్'. తాజాగా ఈ చిత్రాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వీక్షించారు. రాష్ట్రపతి భవన్ లో ఆమె కోసం ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. రాష్ట్రపతితో పాటు చిత్రబృంద సభ్యులు ఈ ప్రదర్శనను వీక్షించారు. దీనికి సంబంధించిన ఫొటోలను అనుపమ్ ఖేర్ పంచుకున్నారు. ''భారత త్రివిధ దళాల అధిపతి సుప్రీం కమాండర్ మా సినిమాను చూడడం మాకు గర్వంగా ఉంది. సినిమా పూర్తయ్యాక చివర్లో ఆమె చప్పట్లు కొట్టడం చూసి నా కల నిజమైందని అనుకున్నాను. ఒక



దర్శకుడిగా ఇంతకు మించి ఏం ఆశించగలను'' అంటూ ఆనందం వ్యక్తంచేశారు.

భారత సాయుధ దళాల ధైర్యం, త్యాగాలకు నివాళిగా రూపొందిన చిత్రం 'తన్వి ది గ్రేట్'. శుభాంగి దత్ ప్రధానపాత్ర పోషించారు. 2002లో వచ్చిన 'ఓం జై జగదీష్' సినిమా తర్వాత అనుపమ్ మళ్లీ ఇప్పుడు 'తన్వి ది గ్రేట్'కి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో జాకీ ష్రాఫ్, అరవింద స్వామి, బొమన్ ఇరానీ, పల్లవి జోషి, నాజర్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. జులై 18న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

# 'రోబో' తర్వాత నా డ్రీం ప్రాజెక్ట్ ఇదే అంటున్న శంకర్.. హాట్ డిస్కషన్స్

ఇండియన్ సినిమా దగ్గర ప్రైడ్ ఇండియన్ దర్శకులు ఇపుడు చాలామందే కనిపిస్తారు. ఇప్పుడు అయితే ఇండియన్ సినిమా దగ్గర నెంబర్ 1 దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి అని అందరికీ తెలిసిందే. మరి అలాంటి దర్శకుడే తనకి కూడా 'ఓజి' దర్శకుడు ఎవరు అంటే మావెరిక్ దర్శకుడు శంకర్ అనే చెప్పిన సందర్భం ఉంది. అలనాటి స్టాండరడ్స్ ని సెట్ చేసుకున్న శంకర్ ఇప్పుడు స్ట్రగుల్ అవుతున్నారు.



టెక్నికల్ గా ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపించే శంకర్ నుంచి వచ్చిన ఎన్నో వండర్స్ లో 'రోబో' కూడా ఒకటి. అయితే లేటెస్ట్ గా శంకర్ చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. తనకి ఒకప్పుడు రోబో సినిమా డ్రీం ప్రాజెక్ట్ అయితే ఇపుడు తనకి 'వేళ్పారి' సినిమా డ్రీం ప్రాజెక్ట్ అని కామెంట్స్ చేశారు. ఈ సినిమా కొత్త ఒక ప్రౌడ్ ఇండియన్ తమిళ్ సినిమాగా నిలుస్తుంది అని ఈ సినిమా ద్వారా అవతార్, గేమ్ ఆఫ్ థ్రోన్స్ తరహాలో కొత్త టెక్నాలజీలని పరిచయం చేసే స్కోప్ ఉందని అనౌన్స్ చేశారు.

అయితే దీనిపై ఆల్రెడీ హాట్ డిస్కషన్స్ మొదలయ్యాయి. శంకర్ మళ్ళీ డబ్బులు వేస్ట్ చేయబోతున్నారని, 24 గంటల ఫుటేజ్ తీయబోతున్నారని ఇలా పలు నెగిటివ్ కామెంట్స్ చేస్తున్నారు.

# 'పెద్ది' నుంచి శివరాజ్ కుమార్ పై మాస్ పోస్టర్ వచ్చేసింది..


గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది కోసం అందరికీ తెలిసిందే. పక్కా మాస్ మసాలా స్పోర్ట్స్ విలేజ్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమా భారీ అంచనాలు సెట్ చేసుకుంది. అయితే ఈ సినిమాకి బుచ్చిబాబు సానా నటీనటులు విషయంలో కానీ తన సాంకేతిక సిబ్బంది విషయంలో కానీ ఎక్కడా వెనక్కి తగ్గలేదు.




ఇలా కన్నడ నుంచి మాస్ ప్రెజెన్స్ కలిగిన పవర్ఫుల్ నటుడు శివ రాజ్ కుమార్ ని కూడా తీసుకున్న సంగతి తెలిసిందే. మరి నేడు శివ రాజ్ కుమార్ పుట్టినరోజు కానుకగా మేకర్స్ తనపై అదిరే పోస్టర్ ని రిలీజ్ చేసారు. ఇందులో పూర్తిగా కొత్త లుక్ లో శివ రాజ్ కుమార్ కనిపిస్తుండడం విశేషం. అంతే కాకుండా తాను గౌర్ నాయుడు అనే పాత్రలో కనిపిస్తారని తన పాత్రని కూడా రివీల్ చేశారు. మరి సినిమాలో తన రోల్ ఏ లెవెల్లో ఉంటుందో చూడాల్సిందే.

# ఒకేసారి నాలుగు పాత్రల్లో అల్లు అర్జున్..

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. 'అఅ 22' (వర్కింగ్ టైటిల్)గా ఇది ప్రచారంలో ఉంది. ఇందులో అల్లు అర్జున్ రోల్ కు సంబంధించిన కొన్నిరోజులుగా కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. ఆయన రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపించనున్నారని మొదట్లో ప్రచారం జరిగింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికర వార్త సినీ ప్రియులను ముఖ్యంగా అల్లు అర్జున్ అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ఈ సినిమాలో అల్లు అర్జున్ మూడు తరాలకు చెందిన నలుగురు వ్యక్తుల పాత్రల్లో కనిపించనున్నారని బాలీవుడ్ మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ మేరకు తాత, తండ్రి, ఇద్దరు కుమారులుగా ఆయన స్క్రీన్ పై సందడి చేయనున్నారని టాక్. అట్లీ ఐడియాకు ఫిదా అయిన బన్నీ సైతం ఆయా లుక్స్ లో ప్రేక్షకులను అలరించేందుకు సన్నద్ధమవుతున్నారని సమాచారం. మరోవైపు, హీరో లుక్స్ కు సంబంధించి టీమ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ తాజాగా వచ్చిన కథనాలు నిజమైతే.. ఒక సినిమా కోసం విభిన్నమైన పాత్రల్లో అల్లు అర్జున్ నటించడం ఇదే తొలిసారి కానుండటం విశేషం. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్ తో ముడిపడి ఉండే సైన్స్ఫిక్షన్ సినిమాగా ఇది ముస్తాబు కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనికోసం చిత్రబృందం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించే పనిలో ఉంది. హాలీవుడ్ కు చెందిన



ఓ ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ ఈ సినిమా కోసం రంగంలోకి దిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ బడ్జెట్ తో ఇది నిర్మితం కానుంది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఇందులో మొత్తం ఐదుగురు హీరోయిన్స్ నటించనున్నట్లు టాక్. అందులో ఒకరు దీపికా పదుకొణె అని టీమ్ స్పష్టతనిచ్చింది. మిగిలిన హీరోయిన్స్ కు సంబంధించి జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక, భాగ్యశ్రీ బోర్సే పేర్లు వినిపిస్తున్నాయి. హాలీవుడ్ కి చెందిన ఓ అగ్ర హీరోని ఇందులో ఓ కీలక పాత్ర కోసం సంప్రదించినట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది.



# 33 సెకన్ల ముద్దు సీన్ తొలగింపు..

## సెన్సార్ తీరుపై నటి ఆగ్రహం

డేవిడ్ కొరెన్స్వెట్, రెచెల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సూపర్ మ్యాన్'. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ సూపర్హీరో చిత్రానికి సంబంధించిన ఇండియన్ వెర్షన్ సెన్సార్ పై బాలీవుడ్ నటి శ్రేయా ధన్వంతరి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ సినిమాలో 33 సెకన్ల ముద్దు సన్నివేశాన్ని తొలగించడాన్ని ఆమె తప్పుపట్టారు. ఇదొక అర్థం పర్థం లేని చర్య అని వ్యాఖ్యానించారు. ఇలాంటి చర్యల వల్ల సినిమాలు చూడాలనే ఆలోచనను ప్రేక్షకులు మానుకుంటారన్నారు.

''సూపర్మ్యాన్'లో 33 సెకన్ల సన్నివేశాన్ని సెన్సార్ తొలగించింది. ఇదేం చర్య? మనం థియేటర్లకు వెళ్లి సినిమాలు చూడాలని సెన్సార్ వాళ్లు కోరుకుంటారు. పైరసీలను ప్రోత్సహించవద్దని అడుగుతారు. కానీ వాళ్లు మాత్రం ఇలాంటి పనులు చేస్తారు. వాళ్ల ఉద్దేశమేంటో నాకు ఏమాత్రం అర్థంకావడం లేదు. ఇలాంటి చర్యలతో థియేటర్ అనుభూతిని దారుణంగా దెబ్బతీస్తున్నారెందుకు? మా డబ్బు, సమయంతో మేము ఏం చూడాలనుకుంటున్నామో మమ్మల్నే నిర్ణయించుకోనివ్వండి. ఇదొక హాస్యాస్పదమైన పని. సినిమా చూడటానికి థియేటర్ ఉత్తమ మార్గం. ప్రేక్షకులను చిన్న పిల్లల్లా భావించి.. థియేటర్ అనుభూతిని పూర్తిగా ఆస్వాదించకుండా చేస్తున్నారు'' అని ఆమె ఇన్ స్టా స్టోరీస్ లో పోస్ట్ పెట్టారు. ఈ చిత్రానికి సంబంధించి హీరో డైలాగ్స్ విషయంలో సెన్సార్ టీమ్ అభ్యంతరం వ్యక్తంచేసింది. కొన్ని సన్నివేశాల్లో హీరో వాడే పదాలను తొలగించాలని ఆదేశించింది. ఆయా మార్పుల అనంతరం సెన్సార్ బృందం యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. 2.10 గంటల నిడివితో ఇది ప్రేక్షకుల ముందుకువచ్చింది. బాలీవుడ్ లో తెరకెక్కిన పలు చిత్రాల్లో శ్రేయా ధన్వంతరి నటించారు. 'ఫ్యామిలీ మ్యాన్', 'చుప్', 'స్కామ్ 1992' వంటి ప్రాజెక్ట్ లు ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. తెలుగులో ఆమె 'జోష్', 'స్నేహ గీతం' సినిమాల్లో నటించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానున్న 'ఫ్యామిలీ మ్యాన్ 3'లోనూ ఆమె కీలక పాత్ర పోషించారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.